ఎవరీ నేహాబోరా!
గూగుల్‌లో.. మోస్ట్ వాంటెడ్ పర్సన్ 3



# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - మంగళవారం 13 అక్టోబర్ 2026 | సంపుటి: 10 | సంచిక: 279 | పేజీలు: 8+4 | వెల రూ.5

71 బైకులతో దుర్గామాత ఆకృతి 2



GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM

# సాంకేతికతతో సుపరిపాలన

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం తిరుమల భక్తుల కోసం కృత్రిమ మేధస్సు ఆధారిత 'వెంకటాద్రి' యాప్ను ప్రారంభించి, దసరా నవరాత్రి ఏర్పాట్లపై సమీక్షలు నిర్వహించారు. సాంకేతికతను జోడించి పాలనను వేగవంతం చేసే దిశగా చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారు.

## ఏపీ సీఎం చంద్రబాబు

**అమరావతి, అక్టోబర్ 12(మనం ప్రత్యేక ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం సరికొత్త పాలనా వ్యూహాలతో, సాంకేతిక ఆవిష్కరణలతో బిజీగా గడిపారు. రాబోయే ఉత్సవాల నిర్వహణతో పాటు, డిజిటల్ టెక్నాలజీ సహాయంతో భక్తులకు సేవలందించే దిశగా ఆయన పలు కీలక సమీక్షలు జరిపారు. భక్తుల రక్షణ, స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణ మరియు పొరుగు రాష్ట్రాలతో దౌత్యపరమైన వ్యూహాలపై ఈ రోజు ప్రధానంగా చర్చలు నడిచాయి.

### భక్తుల కోసమే 'వెంకటాద్రి' యాప్ ఆవిష్కరణ

తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల కోసం తిరుమల తిరుపతి దేవస్థానం సరికొత్తగా అభివృద్ధి చేసిన 'వేంకటాద్రి' డిజిటల్ నావిగేషన్ మొబైల్ అప్లికేషన్ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ యాప్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వాయిస్ అసిస్టెంట్ సౌకర్యం ఉంది. కొండపైకి వచ్చే భక్తులు వాయిస్ కమాండ్స్ ద్వారా తమకు కావలసిన వసతి గృహాలు, లడ్డూ కౌంటర్లు, ప్రసాద వితరణ కేంద్రాలు మరియు వైద్య సేవలను 24 గంటల పాటు సులభంగా కనుగొనవచ్చు. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు సాంకేతికతను వాడాలని సీఎం సూచించారు.

### రాష్ట్రపతి పర్యటనపై సమీక్ష

శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సమయం దగ్గర పడుతుండటంతో పాటు, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజయవాడ పర్యటన నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా ఉన్నతాధికారులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. దుర్గమ్మ దర్శనం, సరస్ మేళాకు హాజరవుతున్న రాష్ట్రపతికి ప్రోటోకాల్, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని యంత్రాంగాన్ని ఆదేశించారు.

## ఫిర్యాదుల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు



### ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, అక్టోబర్,12,(మనం ప్రత్యేక ప్రతినిధి):** ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయొద్దని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. క్షేత్రస్థాయిలో ...మిగతా 2లో



2వ రోజు

## గాయత్రీ దేవిగా దుర్గమ్మ

విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు రెండో రోజుకు చేరుకోగా, కనకదుర్గమ్మ వారు శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సకల వేద స్వరూపిణి, ముక్త విద్రుమ హేమ ధవళ పంచముఖాల తేజస్సుతో కొలువైన అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. తొలిరోజే లక్ష మందికి పైగా దర్శించుకోగా, రెండోరోజు సోమవారం కూడా రద్దీ దృష్ట్యా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 'జై దుర్గా.. జై జై దుర్గా' అంటూ భక్తులు చేస్తున్న నామస్మరణలతో ఇంద్రకీలాద్రి పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో మార్మోగిపోతున్నాయి.



## సుప్రీంకోర్టుకు మార్చ్

## రాహుల్, ప్రియాంకతో పాటు కదం తొక్కిన నాయకులు

- పాల్గొన్న సీఎం రేవంత్, రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నేతలు
- వేలాదిగా పాల్గొన్న కార్యకర్తలు, ప్రజలు

**ఢిల్లీ, అక్టోబర్ 12:** కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ.. నేహా బోరాతో కలిసి సుప్రీంకోర్టు దిశగా మార్చ్ చేపట్టారు. వీరికి మద్దతుగా వేలాది మంది నిరసనకారులు తరలివచ్చారు. దీంతో దేశ రాజధానిలోని పలు ప్రాంతాలు నిరసనకారులతో కిక్కిరిసిపోయాయి. కనాట్ ప్లేస్ నుంచి మండీ హౌస్ వరకు ...మిగతా 2లో

## ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన జరిగే దాకా పోరాడతాం

సీఈసీ జ్ఞానేశ్ నుంచి నాకు సందేశాలు వస్తున్నయ్

మోడీజీ.. మీ వాళ్లు 200 మంది మాతో టచ్‌లో ఉన్నరు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు 2

## కొత్త ఫారం-6 సవరణలను మేం ఆమోదించలే



సీఈసీపై భారత ప్రధాన న్యాయమూర్తి ఆగ్రహం



## బ్రహ్మచారిణిగా శ్రీశైల భ్రమరాంబిక దేవి

శ్రీశైలంలో వైభవంగా శ్రీ దేవీ శరన్నవరాత్రోత్సవాలు

రెండో రోజు బ్రహ్మచారిణి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

మయూరవాహనసేవ, కుమారీపూజలకు ప్రత్యేక ప్రాధాన్యం

**శ్రీశైలం, అక్టోబర్ 12 (మనం న్యూస్):** శ్రీశ్రీశ్రీ భ్రమరాంబికా దేవి సమేత శ్రీ మల్లికార్జున స్వామివారి క్షేత్రమైన ...మిగతా 2లో

# త్వరలో డీఎస్సీ ఉచిత శిక్షణ



## పీ4లో బీసీ యువతకు ఉచిత సివిల్స్ కోచింగ్

బీసీ యువత ఉన్నత స్థానాల్లో కొలువుదీరాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం

బీసీ స్టడీ సర్కిల్ల ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ : మంత్రి సవిత

డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ అకాడమీ, బీసీ సంక్షేమశాఖ మధ్య ఒప్పందం

మంత్రి సవిత సమక్షంలో ఎంఓయూ

ఏటా వంద మందికి శిక్షణతో పాటు మెటీరియల్ అందజేత

ఉచిత వసతి కల్పించనున్న ప్రభుత్వం

**అమరావతి, అక్టోబర్ 12(మనం ప్రత్యేక ప్రతినిధి):** దేశంలోనే తొలిసారిగా పీ4 మోడల్ లో బీసీ నిరుద్యోగ యువతకు ఉచిత సివిల్ సర్వీసెస్ కోచింగ్ ఇవ్వనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత తెలిపారు. ఇందుకోసం ప్రఖ్యాత గాంచిన డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ అకాడమీతో బీసీ సంక్షేమ శాఖ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ సందర్భంగా మెటీరియల్ ఉచితంగా ఇవ్వడంతో పాటు అభ్యర్థులకు నిష్ణాతులైన అధ్యాపకులు బోధించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలోని మంత్రి సవిత సమక్షంతో డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ అకాడమీ ప్రతినిధులు, బీసీ సంక్షేమ శాఖాధికారులు పరస్పరం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీలను అన్ని రంగాల్లోనూ ముందు ఉంచాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. దీనిలో భాగంగా ...మిగతా 2లో

## పట్టణాలు ధీటుగా గ్రామాలే లక్ష్యం

అభివృద్ధి పై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



6



2

## లాలించే.. పాలించిఅమ్మ.. రక్షించే జగన్మాత

లలితా మహాశక్తి తత్త్వమే మహత్తరం

కాలం, అవకాశం, వాక్కును గౌరవిస్తేనే జీవితంలో ఉన్నతి

పరిపూర్ణానంద స్వామి

రెండో రోజు ఘనంగా కోట్ల మంత్రజపాలతో మహాశక్తి యాగం

భారీగా తరలివచ్చిన మహిళా భక్తులు

## కారు దగ్ధం ఘటనలో నలుగురు మృతిపై ముఖ్యమంత్రి విచారం

**అమరావతి, అక్టోబర్ 12 (మనం న్యూస్):** విజయవాడ వెస్ట్ బైపాస్ లో ఎలక్ట్రిక్ కారులో మంటలు చెలరేగి నలు గురు సజీవ దహనమైన దుర్ఘటనపై సీఎం చంద్ర బాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుం బాలకు ప్రగాఢ సానుభూ తి తెలిపారు. క్షతగాత్రుల కు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు రెయిలింగ్ ను ఢీకొని కారులో మంటలు చెలరేగినట్టు ప్రాథమికంగా గుర్తించినట్టు అధికారులు తెలిపారు.



## విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు ప్రమాదంపై వైయస్ జగన్ దిగ్భ్రాంతి

**తాడేపల్లి, అక్టోబర్ 12 (మనం ప్రతినిధి):** విజయవాడ వెస్ట్ బైపాస్లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి గురైన ఈవీ కారు పూర్తిగా దగ్ధమై, నలుగురు మృతి చెందడం అత్యంత విషాదకరమని అన్నారు. ఈ విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు వైయస్ జగన్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘన విజయం ఖాయం!

డిల్లీ నుండి గల్లి వరకు కూటమిదే హవా

బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి 6

## నియోజకవర్గానికో వేంకటేశ్వర స్వామి ఆలయం

- ఒక్కో ఆలయానికి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లు
- దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**పొదలకూరు, అక్టోబర్ 12 (మనం న్యూస్):** రాష్ట్రంలోని 175 శాసనసభ నియోజకవర్గాల్లో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. ఒక్కో ఆలయానికి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు కేటాయించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ...మిగతా 2లో

## జ్ఞానేశ్‌ను తొలగించాల్సిందే తీర్మానం ఆమోదించిన కేరళం అసెంబ్లీ 2

## టీసీఎస్ రిక్రూట్‌మెంట్‌లో 80 శాతం ఫ్రెషర్లే

### డిజిటల్, ఏఐ స్కిల్స్ ఉన్న వారికే ఛాన్స్



**ముంబై, అక్టోబర్ 12:** ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఫ్రెషర్ల నియామకానికి సంబంధించి కీలక అప్డేట్ ఇచ్చింది. కొత్తగా నియమించుకునే ఉద్యోగుల్లో ఇకపై 80 శాతం వరకు డిజిటల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నైపుణ్యాలు కలిగిన వారే ఉంటారని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆరతి సుబ్రమణియన్ పేర్కొన్నారు. ఇటీవల ముగిసిన సెప్టెంబర్ త్రైమాసికంలో మొత్తం ఆదాయంలో ఏఐ ఆదాయం 10 శాతానికి పెరిగిందని, ఈ వాటా మరింత పెరిగితే కంపెనీ మార్జిన్లు కూడా పెరుగుతాయని చెప్పారు. రెండో త్రైమాసికంలో తాము నియమించుకున్న 4,500 మందిలో దాదాపు 25 నుంచి 30 శాతం మంది పూర్తిగా ఏఐపై పట్టున్నవారని సీఓఓ వెల్లడించారు. అందులో 80 శాతం మంది కొత్తతరానికి చెందిన వారేనని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇదే నిష్పత్తిలో ...మిగతా 2లో

రియాద్ విమానాశ్రయంపై క్షిపణిదాడి..

## కామారెడ్డి వాసికి తీవ్ర గాయాలు

**రియాద్, అక్టోబర్ 12:** సౌదీ అరేబియాలోని రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై శనివారం జరిగిన క్షిపణి దాడుల్లో కామారెడ్డికి చెందిన 36 ఏళ్ల షేక్ సయీద్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఆయన పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. రియాద్లోని కింగ్ ఫహద్ ఆరమ్డ్ ఫోర్సెస్ ఆస్పత్రిలో ఆయనకు చికిత్స కొనసాగుతోంది. కామారెడ్డిలోని సైనీ బాబా కాలనీకి చెందిన షేక్ సయీద్ సుమారు 12 ఏళ్లుగా సౌదీ అరేబియాలో ఉంటున్నాడు. కొన్నేళ్లుగా రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ దాడిలో 13 మందికిపైగా మృతి చెందగా.. దాదాపు 300 మందికి గాయాలైనట్లు తెలుస్తోంది.



## ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్



అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఇ.హాల్, మైఖేల్ వుడ్ ఫోర్డ్‌లకు పురస్కారం

'స్థూల ఆర్థిక స్థిరీకరణకు సూక్ష్మ ఆర్థిక పునాదులు' అంశంపై పరిశోధనలకు గుర్తింపుగా అవార్డు

**స్టాక్‌హోం, అక్టోబర్ 12:** రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఆర్థిక శాస్త్రంలో నోబెల్ విజేతలను ప్రకటించింది. 'స్థూల ఆర్థిక స్థిరీకరణకు సూక్ష్మ ఆర్థిక పునాదులు' అంశంపై పరిశోధనలు చేసిన అమెరికాకు చెందిన ప్రముఖ ఆర్థికవేత్తలు రాబర్ట్ ఇ. హాల్, మైఖేల్ వుడ్ ఫోర్డ్ లకు ఈ ఏటి నోబెల్ పురస్కారం లభించింది. స్టాక్ హోం లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ఈ పురస్కారాన్నిస్థూల ఆర్థిక ...మిగతా 2లో

# బ్రహ్మచారిణిగా శ్రీశైల భ్రమరాంబిక దేవి

(మొదటి పేజీ తరువాయి)

శ్రీశైలంలో శ్రీ దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రెండో రోజు అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు, హోమాలు, పారాయణలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని నవదుర్గలలో రెండో స్వరూపమైన శ్రీ బ్రహ్మచారిణి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.

**అమ్మవారికి విశేష పూజలు**

ఉదయం అమ్మవారికి ప్రాతఃకాల పూజలతో పాటు విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు, పారాయణలు, సూర్యనమస్కారాలు, చండీహోమం, భ్రామరి, బాలా జపానుష్ఠానాలు, చండీపారాయణ, చతుర్వేద పారాయణలు, కుమారీపూజలు నిర్వహించారు. అనంతరం రుద్రహోమం, రుద్రయాగాంగ జపాలు, రుద్ర పారాయణలు జరిపించారు.

సాయంత్రం జపాలు, పారాయణలు, నవావరణార్చన, కుంకుమార్చన, చండీహోమం, సహస్రనామార్చనలు నిర్వహించనున్నారు. రాత్రి 9 గంటల నుంచి కాళరాత్రి పూజ, అమ్మవారి ఆస్థాన సేవ, సువాసినీ పూజలు జరగనున్నాయి.

**బ్రహ్మచారిణి అలంకారంలో అమ్మవారు**

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారిని బ్రహ్మచారిణి స్వరూపంలో అలంకరించారు. నవదుర్గలలో రెండో రూపమైన బ్రహ్మచారిణి దేవిని పూజించడం వల్ల భక్తులకు విజయాలు, శుభఫలితాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.బ్రహ్మచారిణి ఉపాసన త్యాగం, వైరాగ్యం వంటి సద్గుణాలను పెంపొందిస్తుందని దేవీభాగవతంలో పేర్కొనబడింది.

ఈ దేవి ద్విభుజురాలుగా, కుడిచేతిలో జపమాల, ఎడమచేతిలో కమండలాన్ని ధరించి దర్శనమిస్తారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని భక్తులు విశ్వసిస్తారు.

**కుమారీపూజకు ప్రత్యేక ప్రాధాన్యం**

దసరా మహోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ కుమారీపూజలు నిర్వహిస్తున్నారు. రెండు నుంచి పది సంవత్సరాల వయస్సు గల బాలికలను దేవీ స్వరూపాలుగా భావించి, పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించి పూజించడం ఈ సంప్రదాయంలోని విశేషం.

నవరాత్రి ఉత్సవాల్లో కుమారీపూజకు విశిష్ట స్థానం ఉంది.

**మయూరవాహనంపై**

**స్వామి అమ్మవార్ల ఊరేగింపు**

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ స్వామి అమ్మవార్లకు మయూరవాహనసేవ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి మయూరవాహనంపై ఆశీనులను చేసి పూజాదికాలు నిర్వహిస్తారు. అనంతరం గ్రామోత్సవం జరగనుంది.శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి తెలిపారు.

# లాలించే.. పాలించిఅమ్మ..రక్షించే జగన్మాత

**కాకినాడ రూరల్, అక్టోబర్ 12(మనంన్యూస్):** అమ్మవారి అనుగ్రహం పొందాలంటే కేవలం నోటితో ప్రార్థిస్తే సరిపోదు.. మనసును, మాటను, ఆత్మను అమ్మవారి పాదాల చెంత సమర్పించాలి. కష్టాలను ఓర్చుకుంటూ, ఏకాగ్రతతో లక్ష్యాన్ని సాధించేందుకు చేసే సాధనే తపస్సు. పది రోజులపాటు నియమబద్ధంగా నిర్వహించే మహాశక్తి యాగం భక్తులకు అలాంటి ఆధ్యాత్మిక సాధనకు గొప్ప అవకాశమని, అమ్మని అలాగే లోపల స్థిరపరచుకొని కుంకుమార్చనలో పాల్గొనాలని శ్రీ పరిపూర్ణానంద స్వామి వివరించారు. కాకినాడ శ్రీ పీఠంలో జరుగుతున్న 'మహాశక్తి యాగం' కార్యక్రమం సోమవారం ఎంతో ఘనంగా జరిగాయి. రెండో రోజు శ్రీపీఠంలో వేంచేసియున్న ఐశ్వర్యంబికా అమ్మవారు వారాహి దేవిగా దర్శనం ఇచ్చారు. రెండో రోజు కూడా భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.కుంకుమ ఆరాధన సుమారు మూడు గంటల పాటు జరిగింది.

ఈ సందర్భంగా శ్రీ పరిపూర్ణానంద స్వామి లలితా దేవి మహాశక్తి స్వరూపం, సామూహిక పారాయణం ప్రాముఖ్యత, మానవ జీవితంలో కాలం, అవకాశం, వాక్కు విలువలను వివరిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. తపస్సు అంటే కేవలం ఒకచోట కూర్చుని పూజలు చేయడం కాదని, ఎన్ని కష్టాలు ఎదురైనా ఓర్పుతో, పట్టుదలతో తాను ఎంచుకున్న మార్గంలో ముందుకు సాగడమే నిజమైన తపస్సు అని పేర్కొన్నారు. సమాజంలో ఎదురయ్యే కష్టాలకు మనిషి ఎక్కువగా పరితపిస్తాడని, అదే దైవం కోసం కొంత సమయం కేటాయించేందుకు మాత్రం వెనుకాడుతాడని అన్నారు. పది రోజులపాటు నియమంతో, దీక్షతో అమ్మవారి నామస్మరణలో పాల్గొనడం భక్తులకు లభించిన గొప్ప అవకాశమని వివరించారు. వ్యక్తిగతంగా ఇంట్లో పూజలు చేసుకోవడం ఒక పద్ధతి అయితే, వేలాది మంది ఒకచోట చేరి మంత్రపారాయణం, అర్చనలు నిర్వహించడం ద్వారా సామూహిక ఆధ్యాత్మిక వాతావరణాన్ని అనుభవించవచ్చని చెప్పారు.

**సామూహిక పారాయణంలో అపారమైన శక్తి**

ఒక్కొక్కరు విడివిడిగా చేసే ప్రార్థనకు, వందలాది మంది లేదా వేలాది మంది కలిసి చేసే సామూహిక పారాయణానికి మధ్య ఉన్న ప్రత్యేకతను ఆయన ఉదాహరణలతో వివరించారు. ప్రతి ఒక్కరి మనసు ఎప్పుడూ ఒకే స్థాయిలో ఏకాగ్రతతో ఉండకపోవచ్చని, అయితే ఒకరు మనసు చలించిన సమయంలో మరొకరు మంత్రంపై దృష్టి నిలిపి ఉంచవచ్చని తెలిపారు.సుదీర్ఘ సమయం మంత్రజపం, పారాయణంలో పాల్గొనడం ద్వారా మనసును ఏకాగ్రత వైపు మళ్లించుకోవచ్చని పేర్కొన్నారు. సామూహిక సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవడం ద్వారా ఆధ్యాత్మిక అనుభూతిని పొందే అవకాశం ఉంటుందని వివరించారు. మహాశక్తి యాగంలో పాల్గొనే భక్తులకు అందించే అన్నప్రసాదాన్ని ఎంతో గౌరవంగా స్వీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వేలాది మంత్రజపాలు, అర్చనలు నిర్వహిస్తున్న పవిత్ర సందర్భంలో భక్తుల ఆరోగ్యం, శ్రేయస్సును ఆకాంక్షిస్తూ భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.అన్నాన్ని వృథా చేయకుండా అవసరమైనంత మాత్రమే వడ్డించుకోవాలని సూచించారు. వడ్డించే వారికి ముందుగానే తమకు ఎంత అవసరమో తెలియజేయాలని, ఆహార ధాన్యాల ధరలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి గింజ విలువను గుర్తించాలని కోరారు. ఆహారాన్ని గౌరవించడం కూడా మన బాధ్యతలో భాగమని స్పష్టం చేశారు.

**కాలం.. అవకాశం.. వాక్కు.. జీవితానికి**

**మూడు కీలక సూత్రాలు**

మానవ జీవితంలో కాలం, అవకాశం, మాటలకు ఎంతో ప్రాధాన్యత ఉందని పరిపూర్ణానంద స్వామి వివరించారు. కాలాన్ని పరమశివుడి స్వరూపంగా, అవకాశాన్ని మహావిష్ణువు అనుగ్రహంగా, వాక్కును సరస్వతీదేవి కటాక్షంగా భావించాలని పేర్కొన్నారు. కాలాన్ని గౌరవించేవారు, తమకు లభించిన అమ్మవారి అనుగ్రహం పొందాలంటే కేవలం నోటితో ప్రార్థిస్తే సరిపోదు.. మనసును, మాటను, ఆత్మను అమ్మవారి పాదాల చెంత సమర్పించాలి. కష్టాలను ఓర్చుకుంటూ, ఏకాగ్రతతో లక్ష్యాన్ని సాధించేందుకు చేసే సాధనే తపస్సు. పది రోజులపాటు నియమబద్ధంగా నిర్వహించే మహాశక్తి యాగం భక్తులకు అలాంటి ఆధ్యాత్మిక సాధనకు గొప్ప అవకాశమని వివరించారు. అవకాశాలను సద్వినియోగం చేసుకునేవారు, మాటలను జాగ్రత్తగా ఉపయోగించేవారు జీవితంలో ఉన్నత స్థాయికి చేరగలరని తెలిపారు. ఒక మంచి మాట మరొకరిలో ఆత్మవిశ్వాసాన్ని నింపగలదని, అదే విధంగా ఒక తప్పుడు మాట వ్యక్తుల మధ్య విభేదాలకు, సమాజంలో అశాంతికి కారణమవుతుందని హెచ్చరించారు. రాజకీయ, వ్యాపార, కళా రంగాలతో పాటు మానవ సమాజంలోని వివిధ వ్యవస్థల నిర్వహణకు జ్ఞానం, సంపద, కార్యనిర్వహణ శక్తి అవసరమని చెప్పారు. ఈ మూడు అంశాలను సరస్వతి, లక్ష్మి, పార్వతీ దేవతల అనుగ్రహంతో అనుసంధానిస్తూ వివరించారు.

**లలిత అంటే లాలించే..**

**పాలించే.. రక్షించే మహాశక్తి**

లలితా దేవి తత్వాన్ని వివరిస్తూ.. లాలయతి, పాలయతి, రక్షతి అనే భావనలను పరిపూర్ణానంద స్వామి ప్రత్యేకంగా ప్రస్తావించారు. అమ్మ బిడ్డను ప్రేమతో లాలించినట్లుగా లలితా దేవి భక్తులను కరుణతో ఆదరిస్తుందని, పాలకురాలిగా వారి శ్రేయస్సును కాంక్షిస్తుందని, రక్షకురాలిగా కాపాడుతుందని వివరించారు. తల్లి తన బిడ్డపై చూపించే ప్రేమకు మించిన నిస్వార్థమైన అనురాగం మరొకటి ఉండదని, అలాంటి మాతృప్రేమకు కోట్ల రెట్ల కరుణాస్వరూపమే జగన్మాత అని పేర్కొన్నారు. భక్తుడు తన అహంకారాన్ని పక్కనపెట్టి, సంపూర్ణ విశ్వాసంతో అమ్మవారిని ఆశ్రయించినప్పుడు ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితిని పొందగలడని తెలిపారు. భక్తి అనేది మాటలకే పరిమితం కాకూడదని, మనసులోని కోపం, అసూయ, ద్వేషం వంటి భావాలను తొలగించుకుని ఆత్మపూర్వకంగా అమ్మవారిని ప్రార్థించాలని సూచించారు.

# త్వరలో డీఎస్సీ ఉచిత శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

బీసీల కులాల సంక్షేమానికి పలు పథకాలు అమలుచేస్తున్నారన్నారు. బీసీ యువత ఉన్నత స్థానాల్లో కొలువుదీరాలన్న ఉద్దేశంతో సివిల్స్ సర్వీసెస్, డీఎస్సీ, గ్రూప్ 1, పోలీస్ డిపార్ట్ మెంట్ లో ఉద్యోగాల కోసం బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ అందజేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ4 మోడల్ లో బీసీ యువతకు ఉచిత సివిల్స్ శిక్షణ అందించడానికి దేశంలో ప్రఖ్యాత గాంచిన డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సివిల్స్ శిక్షణ సందర్భంగా డాక్టర్ లక్ష్మయ్య అకాడమీ మెటీరియల్లతో పాటు నిష్ణాతులైన అధ్యాపకులతో వివిధ సబ్జెక్టులపై బోధన అందించనున్నారన్నారు.

**డీఎస్సీ సహా ఇతర పోటీ పరీక్షలకు**

**త్వరలో ఉచిత శిక్షణ**

2014-19లో బీసీ నిరుద్యోగ యువతకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారని మంత్రి సవిత గుర్తు చేశారు. తరవాత వచ్చిన జగన్ ప్రభుత్వం ఉచిత సివిల్స్ కోచింగ్ నిలిపేసిందన్నారు. దీంతో బీసీ నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు పాలైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ఉచిత సివిల్స్ కోచింగ్ ను పునరుద్ధించిందన్నారు. గడిచిన రెండేళ్లలో 200 మందికి ఉచిత సివిల్స్ కోచింగ్ అంజేశామన్నారు. 2025 మెగా డీఎస్సీకి, గ్రూప్ 1కు కూడా ఉచిత శిక్షణ అందజేశామన్నారు.

త్వరలో సివిల్స్ ఉచిత కోచింగ్ ప్రారంభించనున్నామన్నారు. ప్రభుత్వం నిర్వహించే అర్హత పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన వంద మందికి ఉచిత వసతితో కూడిన శిక్షణ అందజేయనున్నట్లు తెలిపారు. డీఎస్సీ నోఫికేషన్ రాగానే ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు తెలిపారు.

బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఆఫ్ లైన్, ఆన్ లైన్ ద్వారా ఈ శిక్షణ అందజేయనున్నామన్నారు. ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ వంటి పోటీ పరీక్షలకు కూడా ఉచిత శిక్షణ అందించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు.

పాల్గొన్న పీ4 ఫౌండేషన్ వైఎస్ చైర్మన్ కుటుంబరావు మాట్లాడుతూ, ఉచిత సివిల్స్ కోచింగ్ మెయిన్స్ కు ఎంపికైన బీసీ అభ్యర్థులకు రూ.రెండు లక్షల చొప్పున వ్యక్తిగతంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. పీ4 విధానంలో బీసీలను అన్నిరంగాల్లోనూ ముందు ఉంచాలన్నది సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. పార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు భాగవతుల రవికుమార్ మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు ఆశయ సాధనలో భాగంగా బీసీ విద్యార్థులకు ఉచిత సివిల్స్ కోచింగ్ అందజేస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ చీఫ్ మెంటార్ లక్ష్మయ్య మాట్లాడుతూ, బీసీ విద్యార్థులకు సివిల్స్ కు మెరుగైన శిక్షణ అందజేస్తామన్నారు.

ప్రతి విద్యార్థిని వ్యక్తిగతంగా కలిసి, వారికి శిక్షణ అందజేస్తామన్నారు. ఏపీ గెజిటెడ్ జేఏసీ చైర్మన్ కేవీ కృష్ణయ్య మాట్లాడుతూ, తమ ఉద్యోగ సంఘ తరఫున పలువురు విద్యార్థులకు పీ4 విధానంలో సివిల్స్ కోచింగ్ అందజేస్తామని తెలిపారు.

అంతకుముందు మంత్రి సవిత సమక్షంలో ఒప్పంద పత్రాలపై బీసీ సంక్షేమ శాఖ అధికారులు, డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ ప్రతినిదులు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాహుల్, ప్రియాంకతో పాటు కదం తొక్కిన నాయకులు

(మొదటి పేజీ తరువాయి)

రహదారులపై పెద్ద సంఖ్యలో నిరసనకారులు కనిపించారు. ఈ మార్చ్ నేపథ్యంలో ఢిల్లీ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రధాన ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తమయ్యారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసే ఉద్దేశంతో ఈ మార్చ్ కొనసాగింది.

**మార్చ్‌ను అడ్డుకున్న పోలీసులు..**

విపక్ష నేతలు ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, తేజస్వీ యాదవ్, అఖిలేశ్ యాదవ్, సుప్రియా సూలే, సంజయ్ రౌత్, శశి థరూర్, సచిన్ పైలట్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తదితరులు ఇందులో పాల్గొన్నారు. వీరికి మద్దతుగా వేలాది మంది కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. అయితే, భగవాన్ దాస్ రోడ్డు వద్ద బారికేడ్లు పెట్టి విపక్ష నేతలను నిలువరించారు.

**సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు..**

మరోవైపు, సీఈసీ జ్ఞానేశ్ కుమార్కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కాంగ్రెస్ పిటిషన్ దాఖలు చేసింది. రాహుల్ గాంధీ ర్యాలీలోనే ఆగిపోవడంతో న్యాయస్థానానికి రాలేకపోయారు. దీంతో ఆయన తరఫున న్యాయబృందమే పిటిషన్ దాఖలు చేసింది. అంతకుముందు, 'ఓట్ల చోరీ' అంశాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వద్ద లేవనెత్తాలని ఇండియా కూటమి నిర్ణయించింది. ఇందుకు సంబంధించి విజ్ఞాపన పత్రం సమర్పించేందుకు తమకు సమయం ఇవ్వాలని సీజేఐని అభ్యర్థించింది. అయితే, ఇందుకు సీజేఐ తిరస్కరించారు. న్యాయస్థానంలో పెండింగ్లో ఉన్న అంశాన్ని విపక్షాలతో చర్చిస్తే.. అది చట్టవిరుద్ధమే అవుతుందని జస్టిస్ సూర్యకాంత్ విపక్షాలకు లేఖ రాశారు.

# ఫిర్యాదుల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు

(మొదటి పేజీ తరువాయి)

అందుతున్న ప్రభుత్వ సేవలపై ఆరా తీశారు. ప్రస్తుతం పీజీఆర్ఎస్ విధానం ద్వారా ప్రజల సమస్యలను వీలైనంత మేరకు పరిష్కరించగలుగుతున్నామని, మరింత వేగంగా, సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించాలని సీఎస్ సాయి ప్రసాద్ను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆ సమావేశంలో 175 నియోజకవర్గాల నోడల్ అధికారులు ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత వాటిని పరిష్కరించే విషయంలో ఉద్యోగులకు, అధికారులకు జవాబుదారీతనం ఉండేలా చూడాలన్నారు. వివిధ శాఖలపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని... జారీ చేస్తున్న జీవోలను వక్రీకరిస్తూ ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపుతున్నారన్నారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖ జారీ చేసిన జీవోపై ఈ తరహా దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు సమర్థంగా సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సీఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నియోజకవర్గానికో వేంకటేశ్వర స్వామి ఆలయం

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశాల మేరకు 2028 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 5 వేల నూతన ఆలయాల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.సోమవారం పొదలకూరు మండలం మహమ్మదాపురంలో దాత పూండ్ల వెంకటరెడ్డి సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి మంత్రి ఆనం, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి ఇప్పటికే రూ.14.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కృష్ణపట్నం పరిధిలోని రెండు పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 151 ఆలయాల్లో అన్నప్రసాద వితరణ ప్రారంభించామని, వేద విద్య పూర్తిచేసిన 600 మందికి నెలకు రూ.3 వేల చొప్పున సంభావన అందిస్తున్నామని వివరించారు.

**ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ..**

మహమ్మదాపురంలో ఆలయ నిర్మాణానికి ముందుకొచ్చిన దాత వెంకటరెడ్డిని అభినందించారు. ఆలయ ప్రాంగణంలో అదనపు భవన నిర్మాణానికి రూ.50 లక్షలు కేటాయించేందుకు మంత్రి అంగీకరించినట్లు తెలిపారు. గ్రామ హైస్కూల్ అభివృద్ధికి సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.50 లక్షలు సమకూర్చామన్నారు. సర్వేపల్లి ఆలయాల అభివృద్ధికి మరో రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్

(మొదటి పేజీ తరువాయి)

నమూనాల ఆధునికీకరణ, మార్కెట్ శక్తుల పనితీరును సూక్ష్మ ఆర్థిక పునాదులతో విశ్లేషించడంలో వారిద్దరూ చేసిన మార్గదర్శక పరిశోధనలకు గాను ఈ అత్యున్నత గౌరవాన్ని అందజేస్తున్నట్లు నోబెల్ కమిటీ వెల్లడించింది. ఆర్థిక మాంద్యం, వడ్డీ రేట్ల నియంత్రణ, విధాన నిర్ణయాల రూపకల్పనలో వీరి సిద్ధాంతాలు ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులకు దిశానిర్దేశం చేశాయి. అమెరికాకు చెందిన ఈ ఇద్దరు ఆర్థిక నిపుణులు ద్రవ్యోల్బణ నియంత్రణ, వినియోగదారుల ప్రవర్తన, ప్రభుత్వ ద్రవ్య విధానాల ప్రభావాలపై సమగ్ర అధ్యయనాలు చేశారు. స్టాన్ఫోర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన రాబర్ట్ హాల్, కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన మైఖేల్ వుడఖ ఫోర్డులు పరస్పరం సమాంతరంగా అభివృద్ధి చేసిన సిద్ధాంతాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను అర్థం చేసుకోవడంలో కీలక మైలురాళ్లుగా నిలిచాయని జ్యూరీ ప్రశంసించింది. ఈ అవార్డు కింద లభించే 11 మిలియన్ల స్వీడిష్ క్రోనర్ల నగదు బహుమతిని వీరిద్దరూ సమంగా పంచుకోనున్నారు. కాలిఫోర్నియాకు చెందిన రాబర్ట్ ఇ.హాల్.. 1967లో మసాచుసెట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) నుంచి పీహెచ్ డీ పట్టా అందుకున్నారు. ప్రస్తుతం స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ గాపనిచేస్తున్నారు. మసాచుసెట్స్ కు చెందిన వుడ్ ఫోర్డ్ సైతం ఎమ్ఐటీ నుంచి 1983లో పీహెచ్డీ పట్టా పొందారు. కొలంబియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ గా ఉన్నారు.

# టీసీఎస్‌లో రిక్రూట్‌మెంట్‌లో 80 శాతం ఫ్రెషర్లే

(మొదటి పేజీ తరువాయి)

నియామకాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. మార్కెట్లో తగిన ప్రతిభ అందుబాటులో ఉందన్నారు. ఫ్రెషర్లు మాత్రమే కాకుండా.. కొత్త విషయాలు నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండే ఉద్యోగులకూ ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మిడ్ లెవల్ ఇంజినీర్ కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఆసక్తి చూపిస్తే.. వారికి మరింత ప్రయోజనం ఉంటుందని కంపెనీ సీఈఓ కె కృతివాసన్ పేర్కొన్నారు. వారికి సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సంబంధిత డొమైన్ నాలెడ్జ్ కూడా ఉంటుందని చెప్పారు. జూనియర్ ఇంజినీర్లకు ఆ స్థాయిలో అవగాహన ఉండకపోవచ్చని అన్నారు.




# కాక్రోచ్ ఎఫెక్ట్ ఢిల్లీ ధర్నా చౌక్ క్లోజ్

## జంతర్ మంతర్‌ను డీనోటిఫై చేసిన ఢిల్లీ పోలీస్

**ఢిల్లీ, అక్టోబర్ 12:** దేశ రాజధాని ఢిల్లీలోని ప్రఖ్యాత నిరసనల ప్రాంతం జంతర్ మంతర్ వద్ద ఇకనుంచి నిరసన ప్రదర్శనలు చేపట్టలేరు. ఇప్పటివరకూ ప్రభుత్వ విధానాలపై వ్యతిరేకత తెలిపేందుకు కేంద్రంగా ఉన్న ఆ ప్రాంతాన్ని నిరసన ప్రదర్శనలు తెలిపే వేదిక నుంచి తొలగిస్తూ ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జంతర్ మంతర్ ను నిరసనలు తెలిపే ప్రదేశం నుంచి డీనోటిఫై చేస్తున్నామని ఆ ప్రకటనలో కమిషనర్ పేర్కొన్నారు. ఢిల్లీలో నిరసన ప్రదర్శనలు, ఆందోళనలు, బైఠాయింపులు వంటి కార్యక్రమాలు నిర్వహించడానికి మూడు ప్రదేశాలను ఆయన వెల్లడించారు. అవే.. రామ్ లీలా గ్రౌండ్, బురారీ గ్రౌండ్, ఈస్ట్ ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్ అని పేర్కొన్నారు.

# కొత్త ఫారం-6 సవరణలను మేం ఆమోదించలే

**ఢిల్లీ, అక్టోబర్ 12:** కేంద్ర ఎన్నికల కమిషన్ పై సుప్రీంకోర్టు ఆగ్రహంవ్యక్తం చేసింది. బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా కొత్తగా తీసుకొచ్చిన ఫారం-6 పై తాము ఎటువంటి తీర్పు ఇవ్వలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు సోమవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బిహార్ ఎస్ఐఆర్ పై తీర్పు వచ్చే సమయానికి ఫారం-6 లో మార్పులు చూపలేదన్న సీజేఐ.. దరఖాస్తుల్లో మార్పులు ఎవరు చేశారో రికార్డులు పరిశీలించి తేలుస్తామన్నారు. కొత్త ఫారం-6 కు సుప్రీంకోర్టు ఆమోదం ఉందంటూ ఈసీ చేసిన ప్రకటనపై సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మరోసారి అదే వ్యాఖ్య..**

బీహార్ ఎస్ఐఆర్ కేసు విచారణ సందర్భంగా.. తాము సవరించిన 'ఫారం 6'కు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందని ఎన్నికల సంఘం పేర్కొన్నట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. కొత్త ఫారం 6పై సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు ఇవ్వలేదు. బీహార్ ఎస్ఐఆర్ కేసును విచారించిన సమయంలో ఈ కొత్త ఫారమ్కు సంబంధించిన అంశం మా ముందు చర్చకు రాలేదని తేల్చిచెప్పింది. కాగా, బీహార్ ఎస్ఐఆర్కు సంబంధించి మే 2026లో వెలువరించిన తీర్పులో తాము కొత్త ఫారం 6 ప్రకటనను సమర్థించినట్లు సెప్టెంబర్ 26న ఎన్నికల సంఘం ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. అయితే, ఈ వాదనను అప్పట్లో (అక్టోబర్ 5న) విచారించిన మరో వేర్వేరు పిటిషన్ల సందర్భంగా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. తాము ఎటువంటి మార్పులకు ఆమోదం తెలపలేదని స్పష్టం చేసింది. తాజాగా సోమవారం మరోసారి ఇదే విషయాన్ని పునరుద్ఘాటించడంతో జాతీయ స్థాయిలో ఎన్నికల ప్రక్రియపై ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన జరిగే దాకా పోరాడుతాం

**ఢిల్లీ, అక్టోబర్ 12:** సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండుతో సుప్రీం కోర్టుకు తలపెట్టిన ర్యాలీ నేపథ్యంలో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రానికి పలు ప్రశ్నలు సంధించారు. నిరసనల వేళ ఢిల్లీని ఎందుకు జైలుగా మార్చారని ప్రశ్నించారు. 'ఓట్ల చోరీ' అంశాన్ని లేవనెత్తేందుకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అపాయింట్మెంట్ కోరినా అనుమతి లభించని విషయాన్ని ఆయన ప్రస్తావించారు. సీజేఐని ఎవరు నిర్దేశిస్తున్నారని అడిగారు.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నుంచి తనకు సందేశాలు వస్తున్నాయని రాహుల్ ఈ సందర్భంగా తెలిపారు. 'ఆయన ఎంత ఒత్తిడిలో పనిచేస్తున్నారో మేం అర్థం చేసుకోగలం. ఇకనైనా అపూర్వార్హ మారి రాజీనామా చేయండి. అదే మీరు దేశానికి చేసే నిజమైన సేవ. అప్పుడు మేం క్షమిస్తాం'' అని కాంగ్రెస్ ఎంపీ పేర్కొన్నారు.

**ఢిల్లీని జైలుగా మార్చిండ్రెందుకు?**

'బీజేపీకి దేశ ప్రజల్లో 12 ఏళ్లుగా వ్యతిరేకత ఉంది. ఇప్పుడది ఒక స్పష్టమైన రూపం దాల్చుతోంది. కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనల వేళ ఢిల్లీలో ఒక భయానక వాతావరణాన్ని సృష్టించారు. నగర రోడ్లపై దాదాపు 30వేల మంది పోలీసులను మోహరించారు. దేశ రాజధానికి రాకుండా అడ్డుకుంటున్నారు. మొత్తం ఢిల్లీని కోటగా, జైలుగా మార్చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? ఆర్ఎస్ఎస్ గూండాలకు ఉన్న స్వేచ్ఛ.. యువతకు ఎందుకు లేదు? మహిళలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ గూండాలు దాడులు చేస్తున్నారు. ప్రస్తుత పరిణామాలతో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని మాకు తెలుసు. ఆయన రాజీనామా చేయాల్సిందే. అప్పటివరకు మేం వదిలిపెట్టబోం' అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

**సుప్రీంకు వెళ్తాం..**

''దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని.. భారత ప్రధాన న్యాయమూర్తికి చెప్పాలని భావించాం. ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలను సీజేఐ దృష్టికి తీసుకెళ్లాలనుకున్నాం. అందుకోసమే ఆయన అపాయింట్మెంట్ కోరాం. కానీ, మా విజ్ఞప్తిని సీజేఐ తిరస్కరించారు. సుప్రీం కోర్టులో పిటిషన్ వేసుకోవాలని అన్నారు. అందుకే నేడు అత్యున్నత న్యాయస్థానం వరకు ర్యాలీగా వెళ్తున్నాం. జ్ఞానేశ్ కుమార్ పై సుప్రీంలో పిటిషన్ వేస్తాం'' అని రాహుల్ వెల్లడించారు.

**200 మంది ప్రభుత్వాధికారులు మాతో టచ్‌లో..**

''ప్రస్తుతం ప్రజలు, ప్రతిపక్షాలన్నీ ఒకవైపు ఉంటే.. మోడీ, అమిత్ షా, అజిత్ ఢోబాల్, జ్ఞానేశ్ కుమార్, మోహన్ భాగవత్ మరోవైపు ఉన్నారు. వారు ప్రజాస్వామ్యాన్ని చంపేస్తున్నారు. మోడీకి నేను చెప్పేది ఒక్కటే.. మీ ప్రభుత్వంలోని 200 మంది అధికారులు మాతో టచ్ లో ఉన్నారు. ఇది మోడీ-రాహుల్ మధ్య జరిగే యుద్ధం కాదు. దేశ యువత భవిష్యత్తు, రాజ్యాంగాన్ని రక్షించడం కోసం జరుగుతున్న పోరాటం. ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది. ఆ ఐదుగురు నేరగాళ్లు న్యాయవిచారణ ఎదుర్కొనే వరకు వదిలిపెట్టేది లేదు'' అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.



# 71 బైకులతో దుర్గామాత ఆకృతి

**సూరత్, అక్టోబర్ 12:** శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సూరత్ కు చెందిన కొంతమంది బైకర్లు తమ భక్తిని అత్యంత వినూత్న రీతిలో చాటుకున్నారు. సూరత్ లోని సముద్ర తీరంలో 71 ప్రీమియం బైకులను నిర్దిష్ట రీతిలో నిలిపి, ఆకాశం (డ్రోన్) నుంచి చూస్తే 'దుర్గామాత రూపం' కనిపించేలా ఒక అద్భుతాన్ని ఆవిష్కరించారు. తమ వృత్తి, అభిరుచి అయిన బైకింగును అమ్మవారిపై ఉన్న అపరిమితమైన భక్తిశ్రద్ధలతో మిళితం చేసి వారు ప్రదర్శించిన తీరు అందరినీ కట్టిపడేస్తోంది.

'ఇది కదా అసలైన క్రియేటివిటీ.. భక్తికి, ప్యాషన్ కు పర్ఫెక్ట్ కాంబినేషన్! అంటూ బైకర్ల బృందంపై ప్రశంసలు కురుస్తున్నాయి.

# జ్ఞానేశ్‌ను తొలగించాల్సిందే

## తీర్మానం ఆమోదించిన కేరళం అసెంబ్లీ

**తిరువనంతపురం, అక్టోబర్ 12:** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ను తొలగించాలని కోరుతూ కేరళం అసెంబ్లీ సోమవారం ఒక తీర్మానాన్ని పాస్ చేసింది. భారత ఎన్నికల సంఘంలో పారదర్శకత తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని కోరింది. ముఖ్యమంత్రి వీడీ సతీశన్ ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి అధికార కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్), ప్రతిపక్షం సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) మద్దతు తెలిపాయి. కాగా.. తీర్మానంలోని పలు అంశాలపై బీజేపీ అభ్యంతరం తెలిపింది. వాటికి సవరణ చేయాలని బీజేపీ నేతలు కోరగా వాటిని తిరస్కరించారు.

సీఈసీపై వచ్చిన ఆరోపణలపై సభ ఆందోళన వ్యక్తం చేసింది. స్వేచ్ఛాయుత, పారదర్శక, నిష్పక్షపాత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని, అలా నిర్వహించిన ఎన్నికలపైనే భారతదేశ ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందని సభ పేర్కొంది. 'భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) పారదర్శకతపై సందేహాలు వస్తున్న నేపథ్యంలో ఆ రాజ్యాంగబద్ధ వ్యవస్థ విశ్వసనీయతను పునరుద్ధరించడానికి సీఈసీని తొలగించాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి' అని తీర్మానం పేర్కొంది.

ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియలో లోపాలను పరిష్కరించాలని, అర్హులైన ఓటర్లందరికీ ఓటు హక్కును పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వం, ఈసీఐని సభ కోరింది. అలాగే, సీఈసీని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. సీఈసీ ఎంపికలో ప్రధాన మంత్రి, లోక్సభ ప్రతిపక్ష నేతతో పాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన ప్యానెల్ను ఏర్పాటు చేయాలని తీర్మానం పేర్కొంది. 'సరైన విధానాన్ని అనుసరించకుండానే ఓటరు జాబితా నుంచి కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. బడుగు బలహీనవర్గాలు, మైనారిటీలు, యువత, కార్మికుల ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాయడమే. అలాగే, ఓటర్ల జాబితాను తయారు చేయడానికి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ల అధికారాలను కూడా తగ్గించారని మీడియాలో కథనాలు వచ్చాయి. ఫామ్-6కు సవరణలు చేశారని, దీనిపై ఇద్దరు ఎన్నికల అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేశారని పత్రికలు ప్రచురించాయి' అని తీర్మానం వ్యాఖ్యానించింది.

# సాగర్ నగర్ బీచ్ రోడ్‌లో బాణసంచా పేల్చడం నిషేధం

## ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ద్వారక ఏ సి పి హెచ్ మల్లేశ్వరావు

విశాఖపట్నం:మనం న్యూస్ : అరిలోవా పోలీస్ స్టేషన్ పరిధిలోని సాగర్ నగర్ బీచ్ రోడ్, కోకో అరీనా, సీతకొండ వ్యూ పాయింట్, జోడుగుల్లపాలెం ప్రాంతాల్లో బాణసంచా పేల్చడం నిషేధించినట్లు ద్వారక సబ్ డివిజన్ ఏసీపీ హెచ్. మల్లేశ్వరరావు తెలిపారు.ఈ ప్రాంతాలు వన్యప్రాణి సంరక్షణ కేంద్రం / జూ పార్క్ కు ఆనుకుని ఉన్నాయి. ఇక్కడ జింకలు, నెమళ్లు (జాతీయ పక్షి), కోతులు, అడవి పందులు మరియు అనేక రకాల పక్షులు స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి. ఇది పర్యావరణ సున్నిత ప్రాంతం.అయినందువలన ఇటీవల కొంతమంది వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో ఈ ప్రాంతంలో పెద్ద శబ్దాలతో బాణసంచా కాల్చడం వలన వన్యప్రాణులు భయభ్రాంతులకు గురై జనావాసాల్లోకి వస్తున్నాయి. దీనివలన మనుషులకు, జంతువులకు ప్రమాదం ఏర్పడుతోంది. నెమళ్లు, పక్షులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి. సాగర్ నగర్, చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసించే వృద్ధులు, చిన్నారులు, రోగులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మధ్య కాలంలో అర్ధరాత్రి సమయంలో పుట్టినరోజు వేడుకల సందర్భంగా బాణసంచా కాల్చిన వారిపై కేసులు నమోదు చేసి గౌరవ కోర్టు నందు రెస్పాండెంట్స్ ను ప్రొడ్యూస్ చేయగా వారికి ఫైన్ తో




కూడిన శిక్షను గౌరవ జడ్జి విధించారు.

**ప్రజలకు విజ్ఞప్తి:**

సాగర్ నగర్ బీచ్ రోడ్ లో బాణసంచా కాల్చరాదు, అనుమతి లేకుండా డ్రోన్లు ఎగరవేయరాదు, జంతువులను, పక్షులను వేధించరాదు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తప్పవని ఏసీపీ, ద్వారక సబ్ డివిజన్, హెచ్ మల్లేశ్వరావు హెచ్చరించారు.

# రైతు సంక్షేమానికి జాతీయ గుర్తింపు!

- రూ.4,992 కోట్ల రుణాల పంపిణీతో శ్రీ సత్యసాయి జిల్లా ఘనత
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్కు పురస్కారం

**పుట్టపర్తి, అక్టోబర్ 12, మనం న్యూస్:** రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి చేసిన కృషికి శ్రీ సత్యసాయి జిల్లాకు జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. రైతులకు సకాలంలో బ్యాంకు రుణాలు అందించడం, వ్యవసాయాన్ని ప్రోత్సహించడం వంటి అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. న్యూఢిల్లీలోని జాతీయ వ్యవసాయ విజ్ఞాన సముదాయం ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన ప్రధానమంత్రి ధన్యాన్య కృషి యోజన జాతీయ స్థాయి పురస్కార ప్రదానోత్సవంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు.

జిల్లాలో వ్యవసాయ రంగానికి ఆర్థిక చేయూత అందించడంలో భాగంగా మొత్తం 3,69,970 మంది రైతులకు రూ.4,992 కోట్ల మేర రుణాలు పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. సకాలంలో రుణాలు అందడం ద్వారా రైతులకు పెట్టుబడి అవసరాలు తీర్చుకునే అవకాశం కలగడంతో పాటు, సాగు పనులను సమర్థంగా




నిర్వహించేందుకు దోహదపడింది. రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం, నాణ్యమైన పంటల సాగును ప్రోత్సహించడం, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా చేపట్టిన చర్యలకు ఈ జాతీయ పురస్కారం గుర్తింపుగా నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో లభించిన ఈ పురస్కారం జిల్లా యంత్రాంగంపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. జిల్లాలోని రైతులు పండించే పంటల్లో అధిక దిగుబడులు సాధించడంతో పాటు, వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడేలా ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తూ జిల్లా వ్యవసాయ రంగానికి వెన్నెముకగా నిలుస్తున్న ప్రతి రైతుకూ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రైతుల అభ్యున్నతే లక్ష్యంగా మరింత సమర్థంగా పనిచేస్తామని స్పష్టం చేశారు.

శ్రీ సత్యసాయి జిల్లా సాధించిన ఈ జాతీయ గుర్తింపు వ్యవసాయ రంగంలో చేపడుతున్న కార్యక్రమాలకు ప్రోత్సాహాన్నివ్వడంతో పాటు, రైతుల సంక్షేమం దిశగా మరిన్ని మెరుగైన ఫలితాలు సాధించేందుకు స్ఫూర్తిగా నిలవనుంది.

# కూటమి ప్రభుత్వంలో సరికొత్త 'చెత్త' కుంభకోణం..

- లెగసీ వేస్ట్ పేరుతో ఏకంగా రూ.1,200 కోట్ల ప్రజాధనం దోపిడీ
- ఆధారాలతో సహా బయటపెట్టిన వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్ రెడ్డి




**తాడేపల్లి: అక్టోబర్ 12 (మనం ప్రతినిధి):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇసుక, మద్యం, గ్రావెల్, రేషన్ బియ్యం మాఫియాల రూపంలో సాగుతున్న దోపిడీ ఇప్పుడు చివరికి మున్సిపాలిటీల్లోని చెత్త వరకు చేరిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ పేరుతో చంద్రబాబు ప్రభుత్వం ఏకంగా రూ.1,200 కోట్లకు పైగా విలువైన భారీ కుంభకోణానికి తెరలేపిందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో క్లియర్ చేసిన చెత్తను కూడా మళ్లీ రికార్డుల్లో చూపిస్తూ, కేవలం ఐదు నెలల వ్యవధిలోనే లెగసీ చెత్త పరిమాణాన్ని అమాంతం రెట్టింపు చేసి తప్పుడు లెక్కలతో వందల కోట్ల దొంగ బిల్లులు కాజేస్తున్నారని ఆధారాలతో సహా బయటపెట్టారు. చెత్తకుంభకోణంపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తామని.. దీనిపై కచ్చితంగా స్వతంత్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంకా ఏమన్నారంటే...

చెత్తనూ వదలకుండా రూ.1,200 కోట్ల దోపిడీ స్కెచ్! రాష్ట్రంలో చంద్రబాబు పాలనను గమనిస్తే ఒక్కటే లక్ష్యం కనిపిస్తోంది. ఎక్కడ చూసినా దోపిడీ, దోపిడీ, దోపిడీయే. అమరావతి భూములు, పీపీపీ పేరుతో ప్రభుత్వ ఆస్తుల ధారాదత్తం, ఇసుక, గ్రావెల్, మద్యం, రేషన్ బియ్యం మాఫియాల తర్వాత ఇప్పుడు చివరికి మున్సిపాలిటీల్లోని చెత్తను కూడా వదలకుండా దోచుకుంటున్నారు. చరిత్రలో ఎన్నడూ చూడని రీతిలో లెగసీ వేస్ట్ పేరుతో భారీ కుంభకోణానికి పాల్పడుతున్నారు. ఒక్క టన్ను చెత్తను ప్రాసెస్ చేయడానికి ఏకంగా రూ.800 చొప్పున క్లెయిమ్ చేస్తూ, కోటి 63 లక్షల టన్నుల వరకు లెక్కలు పెంచి దాదాపు రూ.1,200 కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు పక్కా స్కెచ్ వేశారు.

# సమాచారాన్ని నిర్ణీత వ్యవధిలో అర్జీదారులకు అందించాలి

- డిఆర్‌ఓ ఏ.మలోల

**అనంతపురం, కలెక్టరేట్ అక్టోబర్ 12 :** మనం న్యూస్ సమాచార హక్కు చట్టం కింద సమాచారాన్ని నిర్ణీత వ్యవధిలో అర్జీదారులకు అందించాలని డిఆర్‌ఓ ఏ.మలోల సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో ఆర్టీఐ వారోత్సవాల్లో భాగంగా సమాచార హక్కు చట్టంకు సంబంధించి ఆయా శాఖల హెచ్‌ఓడిలకు, పిఐఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కింద ఆయా శాఖల పిఐఓలు, ఏపిఐఓల వివరాలు ప్రదర్శించే నోటీస్ బోర్డులను ఆయా కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలన్నారు. 41బి వివరాలు తప్పనిసరిగా అప్డేట్ చేసుకోవాలన్నారు. సమాచార




హక్కు చట్టం కింద అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, కలెక్టరేట్ పిఐఓ అలెగ్జాండర్, సూపరింటెండెంట్లు వసంతలత, రియాజుద్దీన్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు!

### ప్రతి వినతినీ బాధ్యతగా పరిశీలించాలి

### గడువులోగా పరిష్కారం చూపాలి

### ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 296 అర్జీలు

### అధికారులకు జాయింట్ కలెక్టర్ ఆదేశాలు



**పుట్టపర్తి, అక్టోబర్ 12, మనం న్యూస్:** ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించే ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా, వారికి సకాలంలో న్యాయం జరిగేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత మేరకు పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించాలని, తీసుకున్న చర్యలతో ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ వేదికకు మొత్తం 296 అర్జీలు అందగా, వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవడంతో పాటు పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్ పంపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ఎస్డీసీ విజయకుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రైతులు పంట నష్టపరిహార జాబితాలో పేర్లను నమోదు చేసుకోవాలి

### ఖరీఫ్ 2026 పంట నమోదు వివరాలను రైతులు పరిశీలించాలి

**గడివేముల,అక్టోబర్ 12 (మనం న్యూస్):** ఖరీఫ్ 2026లో ఈ-పంట నమోదు ప్రక్రియ పూర్తయిందని మండల వ్యవసాయ అధికారి పవన్కుమార్ తెలిపారు. రైతులందరూ మంగళవారం



తమ రైతు సేవా కేంద్రాలను సందర్శించి పంట వివరాలు సరిగ్గా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. రైతులు తమ ఆధార్ కార్డు, పంట పాస్బుక్ జిరాక్స్ ప్రతులను రైతు సేవా కేంద్రాల్లో అందజేయాలని తెలిపారు. ఖరీఫ్ 2026 పంట నమోదులో వివరాలు సరిగ్గా ఉన్న రైతులు ఈ-కేవైసీ ద్వారా ధ్రువీకరించుకోవాలని సూచించారు. పంట నమోదు కాకపోయినా, వివరాల్లో ఏమైనా అభ్యంతరాలు ఉన్నా రైతులు అర్జీ సమర్పించాలని వ్యవసాయ అధికారి తెలిపారు.

# దివ్యాంగులకు తక్షణ ఊరట!

### వినతులపై వెంటనే స్పందన.. సహాయ ఉపకరణాలు అందించిన జేసీ

### మానవత్వం చాటిన మౌర్య భరద్వాజ్.. ఆరుగురికి ఉపకరణాల పంపిణీ

**పుట్టపర్తి, అక్టోబర్ 12, మనం న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారంలో తక్షణ స్పందన బాధితులకు కొండంత భరోసానిస్తుంది. తమ అవసరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన దివ్యాంగులకు శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ వెంటనే అండగా నిలిచారు. పుట్టపర్తిలోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో దివ్యాంగులు తమకు అవసరమైన సహాయ ఉపకరణాల కోసం వినతులు సమర్పించారు. ట్రైసైకిళ్లు,



వినికిడి యంత్రాలు కావాలని కోరడంతో స్పందించిన జాయింట్ కలెక్టర్ అక్కడికక్కడే వారికి ఉపకరణాలు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

ఈ కార్యక్రమంలో నలుగురికి వినికిడి యంత్రాలు, ఇద్దరికి ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. వినికిడి యంత్రాలు పొందిన వారిలో గజ్జెల కుంటపల్లికి చెందిన నాగరాజు, కొత్తచెరువు మండలం కమ్మలపల్లెకు చెందిన పాములపర్తి నరసింహులు, కదిరికి చెందిన శంకర లక్ష్మి నరసమ్మ, కే. చంద్రశేఖర్ ఉన్నారు. ట్రైసైకిళ్లు పొందిన వారిలో కదిరికి చెందిన ఎస్. షకీల్, కొత్తచెరువుకు చెందిన పి. నరసింహులు ఉన్నారు. అవసరమైన సహాయ ఉపకరణాలు అందడంతో లబ్ధిదారులకు ఊరట లభించింది.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కేవలం వినతులు స్వీకరించడమే కాకుండా, అర్హులైన వారికి తక్షణ సాయం అందించడం ద్వారా అధికారులు ప్రజలకు మరింత చేరువ కావచ్చని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ప్రోగ్రామింగ్ అధికారి షఫియుల్లా, కార్యాలయ సహాయకులు గంగాద్రి తదితరులు పాల్గొన్నారు

# 'గ్రూప్-2' మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

### ఈ నెలాఖరు వరకు దరఖాస్తుకు గడువు

### మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

**అమరావతి, అక్టోబరు 12(మనం ప్రత్యేక ప్రతినిధి)** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేస్తున్న గ్రూప్-2 ఉద్యోగాల కోసం పోటీపడే మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ నెలాఖరు 31వ తేదీ లోగా అర్హత కలిగిన వారందరూ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని అమరావతి లో సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి కోరారు.మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలోని సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్(సిఈడియం) నేతృత్వంలో అర్హులైన మైనారిటీ అభ్యర్థులకు ఏపీపీఎస్సీ గ్రూప్-2 నియామక పరీక్షల కోసం ఆన్ లైన్/ఆఫ్ లైన్ లో



ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిందన్నారు.ఇందులో భాగంగా అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.బిపిఎల్ కార్డు కలిగి ఉండటం ఆఫ్లైన్ కోచింగ్కు తప్పనిసరి అర్హతగా పరిగణించబడుతుందని వెల్లడించారు.దరఖాస్తు సమయంలో సంబంధిత బిపిఎల్ కార్డు( తెల్ల రేషన్ కార్డు)/ధృవీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందన్నారు. గ్రూప్ -2 ఉద్యోగాల సాధన కోసం పోటీపడే మైనారిటీ అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ తో పాటు విద్యాపరమైన మద్దతును అందించడమే ఉచిత శిక్షణ ముఖ్య ఉద్దేశ్యమని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. ఉచిత శిక్షణలో రాత పరీక్ష సన్నద్ధత, జనరల్ స్టడీస్, రీజనింగ్, కరెంట్ అఫైర్స్ తో పాటు నియామక పరీక్షకు నిర్దేశించిన ఇతర సంబంధిత అంశాలపై పూర్తి దృష్టి సారిస్తారని తెలిపారు.మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు, నిర్దేశించిన అర్హతా షరతులకు లోబడి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత,ఆసక్తిగల రాష్ట్రవ్యాప్త మైనారిటీ అభ్యర్థులందరూ తమ వివరాలను'సిఈడియం-ఏపీ' అధికారక వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ పద్ధతిలో నమోదు చేసుకోవాలని కోరారు.

వెబ్ సైట్ : www.apcedmmwd.org లేదా సెల్ నెంబర్లు: 08645-297535, 7386789966 లను సంప్రదించాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కోరారు.

# చనుగొండ్ల గ్రామంలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

- రౌడీషీటర్లు, అనుమానితుల ఇళ్లలో తనిఖీలు..
- అనధికార వాహనాలు స్వాధీనం

**గూడూరు, అక్టోబర్ 12 (మనం న్యూస్):** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా చనుగొండ్ల గ్రామంలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ (ఇఅఖి) నిర్వహించారు. గూడూరు పోలీస్స్టేషన్ ఎస్ఐ, సి. బెలగల్ ఎస్ఐతో పాటు కోడుమూరు సర్కిల్ పోలీసు సిబ్బంది సంయుక్తంగా ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గ్రామంలోని రౌడీషీటర్లు, అనుమానిత షీటర్ల ఇళ్లను తనిఖీ చేసి, అనధికార వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు.

అనంతరం గ్రామ ప్రజలతో పోలీసులు సమావేశం నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల



ఎన్నికల నేపథ్యంలో ప్రజలు శాంతియుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.

ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని అధికారులు తెలిపారు.

# రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజయవాడ పర్యటనకు-విస్తృత ఏర్పాట్లు:సిఎస్

**అమరావతి,అక్టోబరు 12,(మనం ప్రత్యేక ప్రతినిధి):** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 14,15తేదీల్లో విజయవాడ పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ పేర్కొన్నారు.రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి సోమవారం ఆయన వివిధ శాఖల అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించి చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ప్రోటోకాల్ నిబంధనల ప్రకారం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ఇందుకు సంబంధించి రాష్ట్రపతి సచివాలయం నుండి జారీ అయిన మార్గదర్శకాలను తుచ:తప్పక పాటించాలని స్పష్టం చేశారు.ముఖ్యంగా రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి మినిట్ టు మినిట్ కార్యక్రమాన్ని ఆలస్యం లేకుండా సమయపాలనకు అనుగుణంగా జరిగేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఏర్పాట్లకు సంబంధించి సంబంధిత శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులు పటిష్టంగా ఏర్పాటు చేయాలని సిఎస్ ఆదేశించారు.

అంతకు ముందు ఈ వర్చువల్ సమావేశానికి వర్చువల్ గా పాల్గొన్న రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె శ్యామల రావు మాట్లాడుతూ భారత రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి వివిధ శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లపై శాఖల వారీ వివరాలను తెలియజేశారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనకు సంబంధించి డ్రాఫ్టు ముసాయిదా ప్రయాణ సమాచారం(ృట్చ్ఞ ఌఞ్జుట్చటఴ)ప్రకారం ఈనెల 14వతేదీ మధ్యాహ్నం 3.55 గం.లకు రాష్ట్రపతి ఢిల్లీ నుండి విమానంలో బయలుదేరి సా.6.25 గం.లకు గన్నవరం విమానాశ్రయం చేరుకుని అక్కడి నుండి రోడ్డు మార్గంలో విజయవాడ ఇంద్రకీలాద్రికి చేరుకుని రాత్రి 7.20 గం.ల నుండి 7.40 ల వరకు కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం రాత్రికి విజయవాడలో బస చేస్తారు.15వతేది ఉదయం 11.30 గం.లకు పున్నమీ ఘాట్ చేరుకుని ఉ.11.30గం.ల నుండి మధ్యాహ్నం 1గం.వరకూ అక్కడ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సరస్ మేళాలో (ఖిఅఖఅఖి-ఖ్చిజ్ఞా ాజ అట్టజీఛీజ్ఞాట ాజ ఖఙ్చుజ్ఞా అట్టజీట్చుట ఖ్ఛిఛిజీఛ్టీఛ)ముఖ్య అతిధిగా పాల్గొంటారు.తదుపరి మధ్యాహ్నం 1గం.10 నిమిషాల నుండి 2గం.ల10



నిమిషాల వరకూ స్వయం సహాయక సంఘాలు-లాక్పతి దిదిలతో కలిసి విందు కార్యక్రమంలో పాల్గొంటారు.అనంతరం రాష్ట్రపతి మధ్యాహ్నం 2.45 గన్నవరం విమానాశ్రయం చేరుకుని ఢిల్లీ బయలుదేరి వెళతారు. ఈవర్చువల్ సమావేశంలో అదనపు డిజిపి మదుసూదన్ రెడ్డి,పిఆర్ అండ్ ఆర్డి ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే,సెర్ప్ సిఇఓ కరుణ,ఎన్టిఆర్ జిల్లా కలక్టర్ లక్ష్మీషా,ఐఅండ్పిఆర్ డైరెక్టర్ కెఎస్.విశ్వనాథన్,దుర్గగుడి ఇఓ శీనూనాయక్,ప్రోటోకాల్ విభాగం జెస్.రామసుబ్బయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎవరీ నేహాబోరా!

# గూగుల్‌లో మోస్ట్ వాంటెడ్ పర్సన్

**హైదరాబాద్, అక్టోబర్ 12 :** నేహా బోరా.. నేహా బోరా.. గూగుల్లో ట్రెండ్ అయిన పేరు ఇది. ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ ద్వారా ఓట్ చోరీకి పాల్పడ్డారన్న ఆరోపణలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలతో పాటు కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు కూడా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఆందోళనలో భాగంగా ఒక పోలీసు వ్యాన్ను అడ్డుకోవడానికి యత్నించిన ఓ యువతి ప్రస్తుతం సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమెనే నేహా బోరా. లెఫ్ట్ వింగ్కు చెందిన విద్యార్థి విభాగం ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ)కు ఆమె జాతీయ అధ్యక్షురాలిగా ఉన్నారు. జంతర్ మంతర్ వద్ద ప్రదర్శనకు వెళ్తుండగా.. ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయినా కూడా ఆమె తన ఇన్ స్టాగ్రామ్ ఖాతా ద్వారా తన మద్దతుదారులతో మాట్లాడారు. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్న తర్వాత గూగుల్లో నెటిజన్లు నేహా గురించి విస్తృతంగా వెతికారు. ఆమె చదువు, వయసు, ఊరు, తండ్రి పేరు ఎవరో తెలుసుకునేందుకు గూగుల్లో వెతికారు. కాగా.. నేహాది ఉత్తరాఖండ్లోని ఖతిమా నగరం. బెంగాల్లోని సిలిగురిలో పాఠశాల విద్య పూర్తి చేశారు. ఢిల్లీ యూనివర్సిటీలోని హిందూ కాలేజీలో సోషియాలజీ చదివారు. తర్వాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఢిల్లీలో పీజీ పూర్తిచేశారు. అలాగే జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీతోనూ ఆమెకు అనుబంధం ఉంది. ఆ వర్సిటీలో థియేటర్ అండ్ పర్ఫార్మెన్స్ స్టడీస్లో డాక్టోరల్ రీసెర్చ్ చేశారు. 2019, 2020లో పౌరసత్వ



సవరణ చట్టానికి జరిగిన విద్యార్థి ఆందోళనలకు నేహా బోరా నేతృత్వం వహించారు. ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఏఐఎస్ఏ) లో చేరిన తర్వాత క్రమంగా ఆ అసోసియేషన్కు జాతీయ అధ్యక్షురాలి స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం సీజేపీ ఆందోళనలు, నిరసన ప్రదర్శనల ద్వారా ఆమె పేరు విస్తృతంగా ట్రెండ్ అవుతోంది.

## ప్రియమైన సాయీ!



ఒకసారి లేచిరా నా ప్రియ
మిత్రమా!
కప్పులో పొగలు
చిమ్ముతున్న నల్లటి
చిక్మగూర్ కాఫీ
హాలులో బల్లపై ఉప్మా
ప్లేటు నీకై
ఎదురుచూస్తున్నాయి.
చెదిరిన నీ ముంగురులు సరిచేయమని
నీ గుండ్రపాటి దువ్వెన చెపుతున్నది
మరచిపోకు నన్ను అంటూ
షర్ట్ జేబును గుంజింది నీ పెన్ను
ఫిజియోథెరపీకి వెళ్లే టైం అయ్యిందని
నీ వీల్ చైర్ తొందరపెడుతోంది.
గుమ్మం ముందు స్వేచ్ఛాజీవిగా
తెల్లటి సిగరెట్ పొగలు వూద
ఒకసారి లేచి రా ప్రియ మిత్రమా!

నీ పొడవాటి చేతివేళ్ళ నుండి జాలువారే
అందమైన అక్షరాల సరాలు
బ్లాక్ బోర్డు మీద సవరించేది ఎపుడు అని
చాక్ పీస్ తహతహలాడుతున్నది
నువ్వు చెప్పే జీవన పాఠాలు
వినడానికి నీ విద్యార్థులు
కొత్త ఉత్తేజంతో వేచి ఉన్నారు
తరగతి గదిలో అడుగిడ
ఒకసారి లేచి రా ప్రియమైన మాస్టారూ!

నీకిష్టమైన చేపల పులుసు, రొయ్యల వేపుడు
రుచి చూడమని పోటీ పడుతున్నాయి
బజారు నుండి తెచ్చిన తెల్ల వంకాయలు
కడిగి బట్ట మీద అరబెట్టిన ఆవాలు, నువ్వులు
పొడుం చేసిన కారం, పుప్పు, నూనె అన్నీ సిద్ధం
వంకాయ అవకాయ పెడుదువు గానీ
ఒకసారి లేచి రా ప్రియ నేస్తమా!

బ్రెజిల్ నుండి నువు తెచ్చి నాటిన
ఏపుగా ఎదిగిన తేజ్ పత్తా మొక్క చిగురించకుండా
వాడిపోయిన వైనాన్ని చెప్పలేక
ఎంతగా వ్యాకుల పడ్డాను!
జైలు నుండి నువు వచ్చాక ఇంటి వెనుక తోటలో
మనిద్దరం కలసి నాటిన మొక్కలు
వాడి పోయినవి నీవు లేక
గులాబీలు, బంతి, చామంతులు,
నాటుదామన్నావు
కొత్త కుండీలు కొనడానికి వెళ్లాము
ఒకసారి లేని రా ప్రియమైన తోటమాలీ!

వెనుక రైలింగ్‌పై గుమిగూడిన
బూడిద రంగు పక్షుల కిచకిచల



జోరు గొడవల పంచాయితీ తీర్చ...
ఒకసారి లేచి రా ప్రకృతి ప్రియుడా!

నీ స్ఫూర్తిని, ఆదరణను అందుకున్న ఎందరో
నిన్ను కలిసి కళ్లనిండా నిలుపుకోవాలని
మనింటి ముంగిట వెల్లువై వచ్చారు
నీ చివరి సందేశం, కరచాలనం అందించ
ఒకసారి లేచి రా ప్రియమైన విశ్వమానవుడా!

అనంతమైన మన ప్రేమకు, ఆచరణకు
నిలువుటద్దంలా మన మంజీర
గుప్పిటనిండా చర్చించాల్సిన అంశాలతో
ఐసియు గుమ్మం ముందు తచ్చాడుతుంది
ముద్దుల కూతురితో భవిష్యత్ ప్రణాళికలు రచించ
ఒకసారి లేచి రా ప్రియమైన నాన్నా!

కొబ్బరాకుల దాటున తొంగిచూసే
కిరణాల సొగసులో
వేప పూల పరిమళాల ఆస్వాదనలో
అలవోకగా ముంగురులను సవరిస్తూ
నా స్నేహం, నా ప్రేమ లేకుండా
ఈ జీవితానికి అర్థం లేదన్నావు
మనిద్దరం ఒకరికొకరం
తోడు నీడ అన్నావు
చిన్ననాటి నీ అమనితో చేసిన బాసలు తీర్చ
ఒకసారి లేచి రా
నా ప్రియమైన ప్రాణ స్నేహితుడా!

పది సంవత్సరాల ఎడబాటును మరచి
నీ రాకతో సంతోషంలో
తలమునకలవుతున్న వేళ నీ
ఆకస్మిక నిష్క్రమణ మనసును మెలిపెడుతున్నది
అంతులేని వేదనతో బలహీనమైన
నా హృదయం! ఇంకిపోయిన కన్నీళ్లతో
నిండిపోయిన నా కళ్ళు
నీ ప్రేమ నిండిన పెదవుల
స్పర్శకి తపన పడుతున్నాయి.
ముందున్న జీవిత గమనానికి
సరిపోయేంత భరోసానిచ్చే
చివరాఖరి గాఢాలింగనంలో నన్ను బంధించ
ఒకసారి లేచి రా సాయీ నా ప్రియతమా!

స్మరణతో...
**- వసంత**

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు**

# ఢిల్లీలో అప్రకటిత ఎమర్జెన్సీ!



దేశ రాజధాని ఢిల్లీ సుల్తానుల ఏలుబడిలోనో, లేక బ్రిటిషు దొరల అణచివేత పాలనలోనో లేదు. అది రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన స్వతంత్ర భారత ప్రజాస్వామ్యంలో ఉందనే నిజాన్ని నేటి పాలకులు పూర్తిగా మరచిపోయినట్లున్నారు. సమకాలీన భారత రాజకీయ యవనికపై చోటుచేసుకుంటున్న పరిణామాలు, ప్రత్యేకించి దేశ రాజధాని ఢిల్లీ వీధుల్లో విరుచుకు పడుతున్న ఆంక్షల పర్వం స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే అత్యంత హేయమైన, చీకటి అధ్యాయాన్ని ఆవిష్కరిస్తున్నాయి.



గతంలో ఇందిరా గాంధీ స్వయంకృతాపరాధంతో దేశంపై రుద్దిన ఎమర్జెన్సీ కాలపు నల్లటి రోజులను, నేడు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పునరావృతం చేస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు. నాటి ఇందిరమ్మ నిరంకుశత్వానికి, నేటి మోదీ సర్కార్ అణచివేత ధోరణికి మధ్య ఎలాంటి తేడా లేకపోగా, మరింత ఆధునిక సాంకేతిక రూపాలతో పౌరహక్కుల గొంతును దారుణంగా నలిపివేస్తున్నారు.

శాంతియుతంగా నిరసన తెలిపే పౌరులను, హక్కుల ప్రచారకర్తలను, రాజ్యాంగాన్ని రక్షించాల్సిన న్యాయవాదులను వారినివాసాల నుంచే దొంగల్లా అదుపులోకి తీసుకోవడం ఏ రకమైన ప్రజాస్వామ్య సంప్రదాయం? 'శాంతిభద్రతల పరిరక్షణ' అనే బూటకపు సాకు చూపి, ప్రజలు తమ నిరసనను వ్యక్తం చేయకుండా ముందస్తు నిర్బంధాలు చేపట్టడం ప్రభుత్వ అధికారగర్వానికి, నిరంకుశత్వానికి పరాకాష్ట. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 పౌరులకు ప్రసాదించిన ప్రాథమిక భావప్రకటన స్వేచ్ఛను, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కును కాగితాలకే పరిమితం చేస్తూ, పోలీసు యంత్రాంగాన్ని సొంత అజెండా కోసం వాడుకోవడం అత్యంత గర్హనీయం. జంతర్‌మంతర్ వంటి నిర్దేశిత నిరసన ప్రాంతాలకు కిలోమీటర్ల దూరంలో ఉన్న నివాసాల్లోకి చొరబడి అరెస్టులు చేయడం ప్రభుత్వ భయానికి స్పష్టమైన నిదర్శనం. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే గొంతుకలను భద్రతా కారణాల ముసుగులో తొక్కిపెట్టాలని చూడటం పాలకులు తమ బలహీనతను బయట పెట్టుకోవడమే తప్ప మరొకటి కాదు.

ఒకప్పుడు వార్తాపత్రికల ముద్రణను నిలిపివేసి, ప్రసార సాధనాలపై సెన్సార్‌షిప్ విధించి సమాచార రవాణాను ఆపేసిన నిర్బంధ ధోరణిని నేడు 'డిజిటల్ బంద్' రూపంలో కొత్తగా అమలు చేస్తున్నారు. జన్‌పథ్, కర్తవ్యపథ్ వంటి కీలక ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను అర్ధాంతరంగా నిలిపివేయడం, నగరంలోని దాదాపు 57 ప్రధాన మెట్రో స్టేషన్లను ఏకపక్షంగా మూసివేసి లక్షలాది మంది సామాన్య ప్రజల నిత్యజీవితాన్ని స్తంభింపజేయడం పాలకుల భయానికి నిదర్శనం. విమర్శలను ఎదుర్కొనే ధైర్యం లేక, ప్రభుత్వం చేతికి మట్టి అంటుతుందనే భయంతో నగరంలో డిజిటల్ కమ్యూనికేషన్ను స్తంభింపజేయడం కేవలం సమాచారాన్ని నిలిపివేయడం కాదు. పౌరుల జీవనోపాధిని, స్వేచ్ఛాయుత జీవనాన్ని బందీ చేయడమే. ఆధునిక యుగంలో ఇంటర్నెట్ ఆపివేయడం పౌరుల ప్రాథమిక సమాచార హక్కుపై పాలకుల సర్జికల్ స్ట్రైక్ లాంటిది.

ఈ రకమైన విచక్షణారహిత అణచివేతపై దేశ అత్యున్నత న్యాయస్థానం స్పందించిన తీరు ప్రాధాన్యత సంతరించుకుంది. జస్టిస్ బాగ్చి నేతృత్వంలోని ధర్మాసనం 'నిరసనకారులపై జరిగిన ఘటనలను తేలికగా తీసుకోం' అని తేల్చిచెప్పడం రక్షక భటుల నిరంకుశత్వానికి లభించిన తొలి చెంపపెట్టు. ఏకంగా సుప్రీంకోర్టు పరిసరాల్లోనూ సెక్షన్ 144 (బీఎన్ఎస్ఎస్163) విధించి, విధులకు హాజరయ్యే న్యాయవాదులను సైతం భయభ్రాంతులకు గురిచేయడం యంత్రాంగాల నియంత్రణ లేని అధికార దాహానికి అద్దం పడుతోంది. కోర్టు తక్షణమే స్పందించి చట్టవిరుద్ధ నిర్బంధాలపై పూర్తి స్థాయి నివేదిక కోరడం, సేవలను పునరుద్ధరించాలని సూచించడం రాజ్యాంగ పరిరక్షణలో న్యాయవ్యవస్థ ప్రాధాన్యతను మరోసారి చాటిచెప్పింది.

'ఢిల్లీ పీఠం నుండి ఢిల్లీ వీధుల వరకు' సాగుతున్న ఈ ఘర్షణ కేవలం రెండు వర్గాల మధ్య పోరాటం కాదు. ఇది నిరంకుశత్వానికి, ప్రజాస్వామ్య స్ఫూర్తికి మధ్య జరుగుతున్న చారిత్రక యుద్ధం. అధికార పీఠంపై కూర్చున్న ప్రధాని మోదీ ప్రభుత్వం ఏ రకమైన అణచివేత వైఖరిని అవలంబిస్తోందో,అదే ఢిల్లీ వీధుల్లో సామాన్య పౌరుల తీవ్ర నిరసనల రూపంలో బట్టబయలవుతోంది. గతంలో 1974లో ఇందిరా గాంధీ తన అధికార దర్పంతో పౌర హక్కులను తొక్కిపట్టినప్పుడు, ఇదే ఢిల్లీ వీధుల నుంచి ఎగిసిపడిన ప్రజాస్వామ్య తిరుగుబాటు ఆమె సింహాసనాన్ని ఎలా కూకటివేళ్లతో కూల్చివేసిందో మోదీ సర్కార్ చరిత్ర పుటలు తిరగేసి చూసుకోవాలి. పౌరుల సహనానికి కూడా సరిహద్దులు ఉంటాయని పాలకులు గుర్తించాలి.

రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలు తాత్కాలికం, కానీ ప్రజలు మరియు వారికి రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కులు శాశ్వతం. ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సింది పోయి, రక్షణ వ్యవస్థలను ఆయుధాలుగా మార్చుకుని పౌరులను భయభ్రాంతులకు గురిచేసే ఏ ప్రభుత్వమూ చరిత్రలో శాశ్వతంగా నిలవలేదు. అధికార గర్వంతో విర్రవీగుతూ పౌర సమాజం గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తే, దేశప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. ఇప్పటికైనా అప్రకటిత ఎమర్జెన్సీ వైఖరిని వీడి, పౌరుల రాజ్యాంగ హక్కులను పునరుద్ధరించకపోతే.. చరిత్ర ఇందిరా గాంధీని ఎలా క్షమించలేదో, నేటి పాలకులను కూడా అదే బోనులో నిలబెడుతుంది!

**- వెంక గారి భూమయ్య**
9848559863

# హిందూ మతాన్ని స్వీకరించిన తొలి విదేశీ సిస్టర్ నివేదిత

వివేకానందుడి బోధనలకు ప్రభావితమై హిందూ మతాన్ని స్వీకరించిన మొదటి విదేశీ మహిళగా సిస్టర్ నివేదిత చరిత్రను సృష్టించింది. మహిళలకు సరైన విద్యావకాశాలు కల్పించి విద్యావంతులను చేసినపుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఉద్ఘాటించిన సిస్టర్ నివేదిత మహిళా విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేసింది. ఐర్లాండ్‌లోని కౌంటీ టైరోన్‌లో 1867 అక్టోబర్ 28న మార్గరెట్‌గా జన్మించింది. లండన్‌లోనిచర్చి బోర్డింగ్ స్కూల్లో, హాలిఫాక్స్ కాలేజీలో ఆమె చదువు సాగింది. ఒకవైపు చదువు కొనసాగిస్తుండగానే, పదిహేడేళ్ల వయసులోనే చిన్నపిల్లలకు టీచర్‌గా పాఠాలు బోధించేది. తర్వాతి కాలంలో వింబుల్డన్‌లో స్వయంగా ఒక పాఠశాలను నెలకొల్పింది. కాలేజీ చదువు పూర్తయ్యాక వేల్స్కు చెందిన ఒక యువకుడితో నిశ్చితార్థం జరిగింది. నిశ్చితార్థం జరిగిన కొద్ది రోజులకే ఆయన ఆకస్మికంగా మరణించాడు. ఆ షాక్ నుండి త్వరగా తేరుకో లేకపోయింది. మనశ్శాంతి కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనేది. లండన్‌లోని ఒక సంపన్నుని ఇంట ఏర్పాటు చేసిన స్వామీ వివేకానంద వేదాంత ప్రసంగం కార్యక్రమానికి ఒక స్నేహితురాలి ద్వారా హాజరైంది. అక్కడక్కడ సంస్కృత శ్లోకాలను ఉటంకిస్తూ సాగిన వివేకానందుని వాక్ప్రవాహానికి ఆమె మంత్ర ముగ్ధురాలైంది. ఇక అప్పటి నుంచి లండన్‌లో వివేకానందుని కార్యక్రమాలన్నింటికీ క్రమం తప్పకుండా హాజరయ్యేది. సేవా దృక్పథమే ఆమెను లండన్ నుంచి కలకత్తాకు రప్పించింది. జీవితం అగమ్యంగా మారిన స్థితిలో తారసపడ్డ గురువు స్వామి వివేకానంద బోధనలే శాంతి మార్గమని నమ్మింది. అన్నీ వదులుకుని ఆయనతో కలసి భారత్‌కు వచ్చేసింది. అచిర కాలంలోనే సోదరి నివేదితగా భారతీ యులకు చిరపరిచితు రాలైంది.

వివేకానందుడి పిలుపుతో ఆమె సముద్ర మార్గంలో 1898 జనవరి 28న కలకత్తా చేరుకుంది. వివేకా నందుడి గురువైన రామకృష్ణ పరమహంస సాధనలతో గడిపిన దక్షిణేశ్వర ఆలయాన్ని సందర్శించుకుంది. కలకత్తాలో 1898 మార్చి 11న ఏర్పాటైన బహిరంగ కార్యక్రమంలో స్వామి వివేకానంద తొలిసారిగా మార్గరెట్‌ను ప్రజానీకానికి పరిచయం చేశారు. కొద్ది రోజులకే ఆమె రామకృష్ణ పరమహంస సతీమణి శారదా దేవిని కలుసుకుని ఆశీస్సులు తీసుకుంది. జీవితాంతం బ్రహ్మచర్య దీక్షను అవలంబిస్తానని ప్రతిన బూనడంతో స్వామి వివేకానంద ఆమె పేరును 'సోదరి నివేదిత'గా మార్చారు. నివేదిత అంటే భగవంతునికి సమర్పణ చేయబడినది అని అర్థం. నివేదితగా మారిన తర్వాత వివేకానందునితో కలసి ఆమె విస్తృతంగా భారత దేశమంతటా పర్యటించింది. నిధుల సేకరణ కోసం, ఆధ్యాత్మిక ప్రచారం కోసం అమెరికా కూడా వెళ్లింది. అల్మోరాలో ఉన్న సమయంలో ధ్యానం చేయడం లో శిక్షణ పొందింది. భారతదేశం గొప్ప మహిమాన్విత దేశమని పొగుడుతూ పాశ్చాత్య దేశాల్లోని తన మిత్రులకు ఉత్తరాలు రాసేది.

వివేకానంద బోధన గురించి, తనపై వాటి ప్రభావం గురించి తాను రాసిన 'ది మాస్టర్ యాజ్ ఐ సా హిమ్' పుస్తకంలో వివరించింది. ఇతరులపై దయా గుణంతో మెలిగే ఆమె, మంచి అభిరుచి గల కళాకారిణి. సంగీతంలోనూ, చిత్రకళలోనూ ఆమెకు ప్రవేశం ఉండేది. ఉపాధ్యాయురాలిగా పనిచేసిన అనుభవం ఉన్న నివేదిత భారత్‌లోనూ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసింది. ముఖ్యంగా బాలికల విద్యకోసం ఆమె 1898 నవంబరులో కలకత్తాలోని బాగ్‌బజారులో పాఠశాలను ప్రారంభించింది. కనీస విద్యలేని బాలికలకు విద్యను అందించడం లక్ష్యంగా ఆమె పనిచేసింది. అన్నికులాల మహిళలకు చదువు తప్పనిసరిగా రావాలని ఆమె ఆకాంక్షించింది. బెంగాల్ మహిళలతో, మేధావులతో పరిచయాలను ఏర్పాటు చేసుకుని బాలికల విద్యకోసం ఎంతో శ్రమించింది. విశ్వకవి రవీంద్రనాథ టాగూరు, జగదీశ్ చంద్ర బోస్ తదితర ప్రముఖులతో స్నేహసంబంధాలను కొనసాగించింది. 1899 సంవత్సరం మార్చిలో కలకత్తావాసులకు ప్లేగ్ వ్యాధి సోకినపుడు తన శిష్యులతో కలిసి వైద్యసేవలు అందించింది. భారత మహిళల ఔన్నత్యం గురించి, ఆచార వ్యవహారాల గురించి న్యూయార్క్ , షికాగో మొదలైన నగరాల్లో ఆమె ప్రసంగించింది.



వివేకానందుని బోధలను యువతరానికి చేరవేసేందుకు అహరహం కృషి చేసింది. భారత స్వాతంత్ర్యోద్యమాలకు ఇతోధికంగా తోడ్పాటునందించింది. స్వాతంత్ర్య సమర యోధుడు, ఆధ్యాత్మికవేత్త అరబిందో ఆధ్వర్యంలో వెలువడే 'కర్మయోగి' పత్రికకు సంపాదకురాలిగా సేవలందించింది. మేధా సంపత్తిలో భారతదేశం అద్వితీయమైనదని ప్రపంచానికి చాటింది.భారతీయతను పూర్తిగా ఆకలింపు చేసుకున్న ఆమె మహిళావిద్య కోసం ఎంతగానో పాటు పడింది. భారత దేశంతో, భారత ప్రజలతో మమేకమై జీవించిన ఆమె స్ఫూర్తి నేటికీ కొనసాగుతూనే ఉంది. 1906లో బెంగాల్‌కు వరదలు వచ్చినప్పుడు బాధిత ప్రజలకు ఆమె చేసిన సేవ, అందించిన మానసిక ధైర్యం ఎంతో విలువైనవి. భారతీయత ను పుణికిపుచ్చుకుని స్వామి వివేకానందతో అనేక దేశాలు పర్యటించి ప్రసంగించిన ఆమె డార్జిలింగ్‌లో ఉండగా, అనారోగ్యానికి గురైన నివేదిత 1911 అక్టోబర్ 13న తన 43వ ఏట తుదిశ్వాస విడిచింది. ఆమె పేరిట ఏర్పాటైన పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు నేటికీ ఆమె సేవానిరతికి నిదర్శనాలు.

**అక్టోబర్ 13... సిస్టర్ నివేదిత వర్ధంతి**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# బ్రహ్మాండ నాయకునికి బ్రహ్మోత్సవం

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అనగానే భక్తజన ప్రవాహం, తన్మయత్వంతో మిన్నంటేలా వారు చేసే గోవింద నామ స్మరణ, మాడ వీధుల్లో దేవేరులతో స్వామి ఊరేగింపులూ, సాటిలేని వైభవంతో సాగే వాహన సేవలు కళ్ళ ముందు కదులుతాయి. బ్రహ్మోత్సవాల్లో స్వామి వారిని వివిధ రూపాల్లో, అవతారాల్లో దర్శనం చేసుకున్న వారికి అనుకున్న కార్యాలు దిగ్విజయంగా పూర్తి కావడంతో పాటు.. పుణ్యఫలాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. తిరుమల చరిత్రలో, వందల ఏళ్ళనుంచీ వివిధ ఉత్సవాల నిర్వహణ జరుగుతున్నది. ఎందరో రాజులు, ఆర్కాటు నవాబులు, ఈస్టిండియా కంపెనీ ప్రతినిధులు, బ్రిటిష్ అధికారులు, తర్వాత హథీరాం మహంతుల హయాంలో ఉత్సవాలు కొనసాగాయి.



పురాణాలు, శాసనాల ఆధారంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు 6వ శతాబ్దంలో ప్రారంభమైనట్లు తెలుస్తోంది. చక్రవర్తులు, మహరాజులు తమ విజయ పరంపరలకు గుర్తుగా తిరుమలేశుని బ్రహ్మోత్సవాల పేరుతో వైభవంగా ఉత్సవాలను నిర్వహించేవారు. నెలకొకటి చొప్పున ప్రతి ఏటా పన్నెండు బ్రహ్మోత్సవాలు కూడా జరిగేవని చరిత్ర చెబుతోంది. క్రీ.శ.614లో పల్లవరాణి సమవాయ్ (పేరిందేవి) మనవాళ పెరుమాళ్ అనే వెండి భోగ శ్రీనివాసమూర్తి విగ్రహాన్ని తిరుమల ఆలయానికి బహుకరించింది.పెరటాసి నెలలో (కన్యామాసం) జరిగే బ్రహ్మోత్సవాలకు ముందు ఈ వెండి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించేవారు. ఆ తరువాత క్రీ.శ.1254 చైత్ర మాసంలో తెలుగు పల్లవరాజు విజయగండ గోపాలదేవుడు, క్రీ.శ.1328 ఆషాఢ మాసంలో ఆడి తిరునాళ్ల పేరుతో త్రిభువన చక్రవర్తి తిరు వేంకట యాదవ రాయలు, క్రీ.శ.1429 ఆశ్వయుజ మాసంలో వీరప్రతాప దేవ రాయలు, క్రీ.శ.1446లో మాసి తిరునాళ్ల పేరుత హరిహరిరాయలు, క్రీ.శ.1530లోఅచ్యుతరాయలు బ్రహ్మోత్సవంగా ఉత్సవాలు నిర్వహించేవారని చరిత్ర చెబుతోంది. క్రీ.శ.10వ శతాబ్దంలో తిరుమలలో 11రోజులపాటు బ్రహ్మోత్సవాలు జరిగేవి. క్రీ.శ.1339 నుంచి మలయప్ప కోనలో లభించిన మలయప్పస్వామిని ఉత్సవ విగ్రహాలుగా తయారు చేసి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతోంది.

కలియుగ వైకుంఠంలా అలరారుతోన్న తిరుమలలో ఏడాది వార్షిక (సాలకట్ల) బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజుల పాటు సాంప్రదాయ రీతిలో కన్నుల పండువగా కొనసాగ నున్నాయి. భాద్ర పదంలో నిర్వహించే ఉత్సవాలను సాలకట్ల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 11న అంకురార్పణతో ప్రారంభం అయి 20 వరకు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలను ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా, లక్షలాది మంది భక్తుల మధ్య నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.

బ్రహ్మోత్సవాలను ప్రారంభించే ముందు ఎటువంటి ఆటంకాలు కలగకుండా, విజయవంతంగా జరగాలని కోరుకుంటూ వైఖాసన ఆగమనంలోని క్రతువులలో 11న అంకురార్పణంతో ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. శ్రీవారి సేనాధిపతి అయిన విశ్వక్సేనుల వారి ఆలయానికి నైరుతిమూలలో ఉన్న వసంత మండపానికి ఊరేగింపుగా వెళ్ళి, అక్కడ భూమాతకు ప్రత్యేక పూజలు చేసి, ఆ మట్టిలో నవధాన్యాలను నాటడాన్ని అంకురార్పణం అంటారు.

ప్రతిరోజు ఉదయం 8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు స్వామి వారి వాహన సేవలుజరుగుతాయి. గరుడ వాహనం రాత్రి 7 నుండి తెల్లవారు జామున 2 గంటల వరకు నిర్వహిస్తారు. ధ్వజారోహణం ఘట్టంతో తొమ్మిది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

అక్టోబర్ 12నుండి అక్టోబర్ 20 వరకు తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# పూల పండుగ 'బతుకమ్మ'

తెలంగాణ అంటే బతుకమ్మ. బతుకమ్మ అంటే తెలంగాణ. స్త్రీత్వానికి పోషక దేవతగా గౌరీ దేవిని ఆరాధిస్తారు. మహిళాలోకానికి ఇష్ట దైవమైన'గౌరి(పార్వతి)అమ్మ' వారిని ఆటపాటలతో కొలుచుకునే పూల పండుగ బతుకమ్మ. ఊరు, వాడ ఆడపడుచులు అందరూ ఎక్క చోట చేరి పూల బతుకమ్మలను మధ్యలో అమర్చి వాటి చుట్టు చేరి సాంప్రదాయ పద్ధతుల్లో పాటలు పాడుకుంటూ, నాట్యాలు చేస్తూ, బతుకమ్మ పండుగను వైభవోపేతంగా జరుపుకుంటారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు ప్రతీక. ప్రకృతి అందాలను ఆరాధిస్తూ, పుడమి చల్లి విశిష్టతను కీర్తిస్తూ, ఆనందాల తోరణాలను కట్టి, పడుచులంతా ఒక్క చోట చేరి జరుపుకునే 9 రోజులు జరుపుకునే పండుగగా బతుకమ్మకు గుర్తింపు ఉన్నది. ప్రకృతి సిద్ధంగా తెలంగాణ ప్రాంతాల్లో లభించే అందమైన, రంగు రంగుల పూలను సేకరించి బతుకమ్మలను పేర్చుతారు. చెలకలు, చేనుల్లో మొలిచే సహజ పువ్వులైన తంగేడు, గునుగు, గుమ్మడి, కట్ల పూలు, సీత జడ పూలు లాంటివి సేకరించి బతుకమ్మలను పేర్చి మధ్యలో గుమ్మడి పూవ్వును, గౌరమ్మను అమర్చి కొలుచుకుంటారు. తంగేడు పువ్వు శక్తికి, గుమ్మడి పువ్వు మంగళకరమైన సౌందర్యానికి ప్రతీకలుగా తీసుకుంటారు.

ప్రతి ఏట మహాలయా అమావాస్య (పెత్రామాస లేదా పితృ అమావాస్య) రోజున 10 అక్టోబర్ 2026 'ఎంగిలి పూల బతుకమ్మ'తో మొదలై తొమ్మిదవ రోజు 18 అక్టోబర్ 2026న 'సద్దుల బతుకమ్మ'తో ముగుస్తుంది. బతుకమ్మపై అమ ర్చిన పసుపుతో చేసిన గౌరమ్మను మహిళలు తమ మంగళ సూత్రాలకు పెట్టుకొని దీర్ఘ సుమంగళిగా ఉండాలని అమ్మ వారిని కోరుకుంటారు. తీరొక్క పూలతో చేసిన పెద్ద పెద్ద బతుకమ్మలను సమీప చెరువు వద్దకు చేర్చి, వలయాకారంలో నిలబడి, నెమ్మదిగా లయబద్దంగా కదులుతూ, పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ, కోలాటాలు ఆడుతూ, ఆటపాటలతో సంబరాలు చేసుకుంటారు. చివరకు సమీప చెరువుల్లో బతుకమ్మను నిమజ్జనం చేసి ప్రసాదాలు పంచి పెడతారు. ప్రతి రోజు ఒక నైవేద్యాన్ని తయారు చేసి దేవతకు సమర్పిస్తారు. 10 అక్టోబర్ 2026 రోజున 'ఎంగిలి పూల బతుకమ్మ'తో ప్రారంభమైన తొమ్మిది రోజుల పాటు 'అటుకుల బతుకమ్మ', 'ముద్దపప్పు బతుకమ్మ', 'నానే బియ్యం బతుకమ్మ', 'అట్ల బతుకమ్మ', 'అలిగిన బతుకమ్మ', 'వేపకాయల బతుకమ్మ', 'వెన్న ముద్దల బతుకమ్మ', 18 అక్టోబర్ రోజున 'సద్దుల లేదా పెద్దబతుకమ్మ' పండుగలను నిర్వహించు కుంటారు.



బతుకమ్మ పండుగ ప్రారంభ నేపథ్యం అతి పురాతనమైనది. ధర్మాంగుడు అనే రాజుకు వంద సంతానం కలిగిన పుట్టిన తర్వాత చని పోతుంటారు. దుఃఖంలో మునిగిన రాజు దంపతులకు లక్ష్మీ దేవి రూపంలో వందవ సంతానంగా ఆడ బిడ్డ జన్మిస్తుంది. ఆ చిన్నారి పలు అనారోగ్యాలను జయిస్తూ, మునుల నుంచి 'నవ్వు కలకాలం బతుకమ్మ' అంటూ దీవించబడుతుంది. నాటి నుంచి నేటి వరకు తెలంగాణ ప్రాంతానికే ప్రత్యేకమైన పర్వదినాలుగా 'బతుకమ్మ' పండుగను జరుపు కుంటున్నారు. పూల రంగుల మేళవింపుతో ప్రతి ప్రాంతం బతుకమ్మ పూదోటగా గుబాళిస్తుంది. బతుకమ్మ పాటల్లో పల్లె అందాలు, ప్రకృతి పట్ల మమకారాలు, పంట చేల పట్ల ఆరాదణలు స్పష్టంగా కనిపిస్తాయి.

బతుకమ్మ పాటల్లో పల్లెతనం, అమాయకత్వం, ఒక ప్రకృతి ఆరాధణ, ఒక కథ, ఒక సంస్కృతి, ఒక ఆశ, ఒక స్ఫూర్తి దాగి ఉంటాయి. బతుకమ్మ పండుగకు ముందు ఏడు రోజుల పాటు బొడ్డెమ్మ పండుగ జరుపుకుంటాం.

పువ్వులు విరివిగా వికసించే కాలం, చెరువులు నిండు గర్భిణిలుగా కనిపించే కాలంలో వచ్చే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన గీతికగా, సంస్కృతిక ప్రతీకగా నిలుస్తున్నది. తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్గా పూల బతుకమ్మ సదా నిలుస్తున్నది.అందరి ఆనంద ఆరోగ్యాలకు కారణం అవుతున్నది నేలతో నీటితో మానవులకు ఉన్న అనుబంధాన్ని బతుకమ్మ చాటుతున్నది.

**- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# ఆర్టీఐ ఆవశ్యకతను అధికారులు తెలుసుకోవాలి

### ప్రజలకు అవగాహన కల్పించాలి

### ఆర్టీఐ చట్టం వారోత్సవంలో కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్




**విశాఖపట్నం, అక్టోబర్ 12:** సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ఆవశ్యకతను ప్రతి అధికారి తెలుసుకోవడంతో పాటు, ఈ చట్టం ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సూచించారు. పారదర్శక పాలన, జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో సమాచార హక్కు చట్టం కీలకమని పేర్కొన్నారు. ఆర్టీఐ చట్టం-2005 వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ అధికారి చట్టంలోని నిబంధనలు, తమ బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలు కోరిన సమాచారాన్ని చట్ట పరిధిలో సకాలంలో అందిస్తూ, ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు. ఆర్టీఐ దరఖాస్తులను అందుకున్న వెంటనే పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, సంబంధిత కార్యాలయానికి చెందని దరఖాస్తులను చట్టంలోని సెక్షన్ 6(3) ప్రకారం నిర్ణీత గడువులోగా సంబంధిత శాఖకు బదిలీ చేయాలని సూచించారు. ప్రతి కార్యాలయంలో సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం వెల్లడించాల్సిన వివరాలను, అధికారుల పేర్లు, సంప్రదింపు నంబర్లు, వారు నిర్వహించే అంశాలకు సంబంధించిన సమాచారాన్ని కార్యాలయాల్లో, ఆన్లైన్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సమాచార హక్కు చట్టంపై అధికారులు తమ పరిధిలోని సిబ్బందికి అవగాహన కల్పించడంతో పాటు, ప్రజలకు కూడా ఈ చట్టం ద్వారా సమాచారం పొందే విధానం, దరఖాస్తు ప్రక్రియ, తమ హక్కుల గురించి తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

ఈ క్రమంలో సమాచార హక్కు చట్టంలోని సాంకేతిక, న్యాయపరమైన అంశాలను, ఇతర నిబంధనలను కలెక్టరేట్ ఏవో బీవీ రాణి కలెక్టర్ సమక్షంలో వివరించారు. వారోత్సవాల ప్రాధాన్యతను తెలిపారు. జిల్లా, మండల స్థాయిలో వారోత్సవాలను నిర్వహించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, పలువురు డిప్యూటీ కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

**నేడు రూ.1.10 కోట్లతో 365 మందికి 530 సహాయక ఉపకరణాలు పంపిణీ చేయనున్న కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల**



**పాలకొల్లు:, అక్టోబర్ 12(మనం ప్రతినిధి):** దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా ఆత్మగౌరవంతో, స్వతంత్రంగా జీవించాలన్న మానవతా దృక్పథంతో సహాయక ఉపకరణాలను అందిస్తున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. దివ్యాంగులకు అండగా నిలిచి వారి జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ () సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.1.10 కోట్ల విలువైన సహాయక ఉపకరణాలను కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మతో కలిసి అందించనున్నట్లు తెలిపారు. పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో మంగళవారం దివ్యాంగులకు పంపిణీ చేయనున్న సహాయక ఉపకరణాలను ఆయన పరిశీలించారు. ఉపకరణాల వివరాలు, లబ్ధిదారులకు వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమం ద్వారా పాలకొల్లు నియోజకవర్గానికి చెందిన 365 మంది దివ్యాంగులకు రూ.1.10 కోట్ల విలువైన 530 సహాయక ఉపకరణాలను ఉచితంగా అందించనున్నారు. వీటిలో 148 బ్యాటరీతో నడిచే మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు, 172 డిజిటల్ వినికిడి యంత్రాలు, 75 వీల్చైర్లు, 25 చేతితో నడిపే ట్రైసైకిళ్లు, 82 నడక సహాయక పరికరాలు ఉన్నాయి. ఒక్కో లబ్ధిదారుకు సగటున రూ.30 వేల విలువైన సహాయం అందనుంది. లబ్ధిదారుల్లో 253 మంది పురుషులు, 112 మంది మహిళలు ఉన్నారు. వీరిలో 250 మందికి పైగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందినవారు ఉన్నారు. మూడేళ్ల చిన్నారి నుంచి 87 ఏళ్ల వృద్ధుడి వరకు వివిధ వయసుల వారు ఈ సహాయం పొందనున్నారు. నడక, వినికిడి, రోజువారీ పనుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఈ ఉపకరణాలు ఎంతో తోడ్పడనున్నాయి. ముఖ్యంగా మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు దివ్యాంగులు స్వయంగా ప్రయాణించేందుకు, వీల్చైర్లు కదలికలను సులభతరం చేసేందుకు ఉపయోగపడనున్నాయి.

### గుర్తించిన వారికి ఉపకరణాల పంపిణీ

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా () కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. అర్హులైన దివ్యాంగులను గుర్తించేందుకు 2025 జూలై 20న పాలకొల్లు మున్సిపల్ కార్యాలయంలో అంచనా శిబిరాన్ని నిర్వహించారు. ఆ శిబిరంలో గుర్తించిన వారికి ఇప్పుడు ఉపకరణాలను అందించనున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2019 తర్వాత ఈ స్థాయిలో దివ్యాంగులకు సహాయక ఉపకరణాలు పంపిణీ చేసే కార్యక్రమం ఇదే తొలిసారి అని మంత్రి రామానాయుడు తెలిపారు. కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ చొరవతో నిధులు సమకూరడం, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు సహకారంతో పాలకొల్లులో ఈ కార్యక్రమం నిర్వహించడం ద్వారా అర్హులైన దివ్యాంగులకు ప్రయోజనం చేకూరనుంది.



# ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

**పెంటపాడు అక్టోబర్ 12(మనం న్యూస్):** ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలను అందించడం, ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ,ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం పెంటపాడు మండలంలో పలు గ్రామాల్లో రోడ్లకు శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వ సహకారంతో తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని , నాణ్యమైన రహదారుల నిర్మాణం, గ్రామీణ మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనుల అమలుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆర్డీవో సూర్యరావు , తాసిల్దార్ రవికుమార్, ఎంపీడీవో వెంకటేష్ ,కూటమి నాయకులు, సంబంధిత శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో రోడ్లు అభివృద్ధి



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 12 (మనం న్యూస్):** రోడ్లు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం తాడేపల్లిగూడెం మండలంలో పలు గ్రామాల్లో , కుంచనపల్లి, కొండప్రోలు, చినతాడేపల్లి, కడియద్ద, బంగారుగూడెం, కొత్తూరు, ఆరుగొలను, నూతన బీటీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్లలో రోడ్లు పూర్తిగా దెబ్బతిని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాగానే తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో చాలా చోట్ల రోడ్ల నిర్మించడం జరిగిందన్నారు. నాణ్యతతో పనులు చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆరుగొలను క్వారీ తవ్వకాలపై ఆయన మండిపడ్డారు. 100 అడుగుల పైగా తవ్వకాలు చేపట్టారని దాని వల్ల ప్రజల ప్రాణాలకే ప్రమాదమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సూర్యారావు , తాసిల్దార్ సునీల్ కుమార్ , ఎంపీడీవో చంద్రశేఖర్ , కూటమి నాయకులు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 12 (మనం న్యూస్):** పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం టౌన్ లో స్థానిక సంజీవ నగర్ హైస్కూల్ సమీపంలో 750 కేజీల పీడీఎస్ రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన ప్రభుత్వ బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తాడేపల్లిగూడెం సివిల్ సప్లై డీటీ నాగమణి తెలిపారు. సోమవారం తాడేపల్లిగూడెం లోని స్థానిక మసీదు సెంటర్ సమీపంలోని రేషన్ షాపు నుంచి భారీగా బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు.తాడేపల్లిగూడెం , పెంటపాడు మండలాల్లో రేషన్ షాపుల నుండి అక్రమంగా రేషన్ డీలర్లు బయటి మార్కెట్ కి అమ్ముతున్నట్లు ప్రజలు తెలుపుతున్నారు. తాడేపల్లిగూడెం , పెంటపాడు మండలాల్లో రేషన్ షాపు డీలర్ల పై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. తాడేపల్లిగూడెంకు చెందిన కొందరు వ్యక్తులు గ్రూపుగా ఏర్పడి రేషన్ బియ్యం అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్నారన్న ఆరోప ణలు వినిపిస్తున్నాయి.పెంటపాడు, తాడేపల్లి గూడెం మండలాల్లో గ్రామాల్లో పేదలకు అందాల్సి న ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న ట్లు ప్రజలు వాపోతున్నారు.పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న రేషన్ షాపు డీలర్లపై అధికారులు దర్యాప్తు చేసి చట్ట రీత్యా చర్య లు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# నూకాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న ముదునూరి మురళీకృష్ణరాజు



**శంఖవరం, అక్టోబరు 12 మనం ప్రతినిధి:** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలోని పాత కొత్తూరులో పునర్నిర్మించిన శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ నాయకుడు గాబు గంగ ఆహ్వానం మేరకు మహోత్సవానికి విచ్చేసిన మురళీకృష్ణరాజు నూకాలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణం అనంతరం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గాబు కృష్ణ, శంఖవరం మండల వైఎస్సార్సీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు జీలకర్ర లక్ష్మణ్, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబుతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# పాత్రికేయుడు సిగిరెడ్డి రమేష్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ



**శంఖవరం, అక్టోబర్ 12(మనం ప్రతినిధి):** పాత్రికేయుడు సిగిరెడ్డి రమేష్పై గోమాఫియా వ్యక్తులు దాడికి పాల్పడటం అత్యంత దుర్మార్గమని, ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగే దాడిగా భావించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి తీవ్రంగా ఖండించారు. సోమవారం ఆమె ప్రత్తిపాడు మండలం రౌతుపాలెం గ్రామంలోని రమేష్ నివాసానికి వెళ్లి, ఇటీవల జరిగిన దాడిలో గాయపడిన ఆయన్ను స్వయంగా పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బెహరా రాజా రాజేశ్వరి, మాకినీడి శేషు కుమారి, శెట్టి సత్తిబాబు, చక్కపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కౌంటింగ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలి

**ఆంధ్ర విశ్వవిద్యాలయ క్యాంపస్లో కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.**

**కౌంటింగ్ గదులు, స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్, ఫుడ్ కౌంటర్ల ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు.**

**ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల్లో రిసెప్షన్, అటెండెన్స్, పోలీస్, ఫుడ్ కౌంటర్లు, పార్కింగ్ సదుపాయాలు కల్పించాలి.**



**విశాఖపట్నం, అక్టోబర్ 12:** జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికలు-2026 నిర్వహణకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయ క్యాంపస్లోని కౌంటింగ్ కేంద్రాలను, అన్ని జోన్ల పరిధిలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను పటిష్టంగా సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అథారిటీ కేతన్ గార్గ్ అదనపు కమిషనర్లు, ప్రధాన ఇంజినీర్, చీఫ్ సిటీ ప్లానర్, అందరు జోనల్ కమిషనర్లు, సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయ క్యాంపస్లోని న్యూ క్లాస్ రూమ్ బ్లాక్, ఇన్స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ సైన్స్, కెమికల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, ఎకనామిక్స్, ప్రిన్సిపల్ బ్లాక్, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్స్, ఎకనామిక్స్ డిపార్ట్మెంట్ తదితర బ్లాకులను,విభాగాలను కమిషనర్ విస్తృతంగా పరిశీలించారు.

కౌంటింగ్ ప్రక్రియకు అనువైన గదులను గుర్తించి, తగినంత గాలి, వెలుతురు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. కౌంటింగ్ గదుల్లో ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా సీటింగ్ ఏర్పాట్లు చేపట్టాలని, స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్ కేంద్రాలు, ఫుడ్ కౌంటర్లను అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ గదులు, రూట్ మ్యాప్ల వివరాలను ముందుగానే ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేసుకోవాలని, అదనపు కమిషనర్లు, ప్రధాన ఇంజినీర్, చీఫ్ సిటీ ప్లానర్, అందరు జోనల్ కమిషనర్లు, సంబంధిత ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఏర్పాట్లను సమీక్షించాలని సూచించారు. ఎటువంటి లోపాలకు తావులేకుండా అవసరమైన సదుపాయాలను ముందుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో, ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామగ్రిని అన్ని జోన్ల పరిధిలో నిర్దేశించిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు ఇప్పటికే తరలించినట్లు కమిషనర్ తెలిపారు. ఆయా కేంద్రాల్లో రిసెప్షన్ సెంటర్, అటెండెన్స్ కౌంటర్, ఫుడ్ కౌంటర్, పోలీస్ కౌంటర్, పార్కింగ్ తదితర ఏర్పాట్లను అందరు జోనల్ కమిషనర్లు స్వయంగా పరిశీలించి, అవసరమైన సదుపాయాలను సమకూర్చాలని ఆదేశించారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని, సామగ్రి పంపిణీ, సిబ్బంది రాకపోకలు సజావుగా జరిగేలా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేసి, ఎన్నికల మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో మేయర్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ దయానిధి, అదనపు కమిషనర్లు కే. రమేష్, డి.వి. రమణమూర్తి, ఎస్.ఎస్. వర్మ, ప్రధాన ఇంజినీర్ పి.వి.వి. సత్యనారాయణ రాజు, చీఫ్ సిటీ ప్లానర్ ఎ. ప్రభాకర్ రావు, అందరు జోనల్ కమిషనర్లు, పర్యవేక్షక ఇంజినీర్లు, డిప్యూటీ సిటీ ప్లానర్లు, అసిస్టెంట్ ప్లానర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, ప్లానింగ్ అధికారులు, అమెనిటీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు

# ఏయూ ఇంచార్జి వీసీగా ఆచార్య పులిపాటి కింగ్



**ఆంధ్రవిశ్వవిద్యాలయం, అక్టోబర్ 10:** ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంచార్జి వీసీగా రెక్టార్ ఆచార్య పులిపాటి కింగ్ను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామల రావు జి.ఓ ఆర్.టి 323ను జారీ చేశారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ అమెరికాలో ఈ నెల 8 నుంచి 19వ తేదీ వరకు పర్యటించడానికి, సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు, ఫ్యాకల్టీ, స్టూడెంట్ మెబిలిటీ, అడ్వాన్స్డ్ టెక్నాలజీ ప్రోగ్రాములపై చర్చించడానికి అనుమతిని మంజూరు చేసినట్లు ఈ ఉత్తర్వులలో పేర్కొంది.

అదే విధంగా పైన పేర్కొన్న కాలానికి గాను ఏయూ రెక్టార్ పనిచేస్తున్న ఆచార్య పులిపాటి కింగ్ను విశ్వవిద్యాలయం ఇంచార్జి వీసీగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొంది. ఈ సందర్భంగా రెక్టార్ ఆచార్య పులిపాటి కింగ్ను పలువురు ఆచార్యులు కలిసి అభినందించారు.

# పీజీఆర్ఎస్ పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

### ప్రజలకు నాణ్యమైన సేవలందించి సంతృప్తి స్థాయిని పెంచాలి: కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్



**విశాఖపట్నం, అక్టోబర్ 12:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీలను నాణ్యతతో, బాధ్యతాయుతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా పీజీఆర్ఎస్పై పర్యవేక్షణ చేస్తున్నందున అధికారులు ఈ వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ప్రజల సంతృప్తి స్థాయిని పెంచేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన పీజీఆర్ఎస్లో వివిధ శాఖలకు అందిన అర్జీలు, వాటి పరిష్కార విధానంపై కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మొత్తం 296 అర్జీలు అందగా, రెవెన్యూ క్లినిక్కు 38, జీవీఎంసీకి 77, పోలీస్ శాఖకు 19, ఇతర శాఖలకు 162 అర్జీలు వచ్చాయి. జేసీ, డీఆర్వో, అదనపు కమిషనర్ లతో కలిసి ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు.

ఈ క్రమంలో అర్జీల పరిష్కారంలో ఇంప్రాపర్ రెడ్రెస్సల్, ప్రీ ఆడిట్, సూపర్ ఆడిట్ ప్రక్రియల్లో తప్పులు గుర్తించిన అధికారులను పిలిపించి కలెక్టర్ వివరణ కోరారు. ముఖ్యంగా జీవీఎంసీ పరిధిలో అందుతున్న వినతులకు నాణ్యమైన పరిష్కారం చూపడంలో అధికారులు విఫలమవుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడకుండా సరైన విచారణ నివేదికలు సమర్పించని ముగ్గురేసి అధికారులను పిలిపించి వివరణ కోరారు. విచారణకు హాజరుకాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పీజీఆర్ఎస్ నోడల్ అధికారి శేషశైలజను ఆదేశించారు.

# మానవత్వంతో ముందుకొచ్చిన జనసేన నాయకుడు తలపంటి బుజ్జి

- మృతురాలి కుటుంబానికి పరామర్శ..

**50 కిలోల బియ్యం, ఆర్థిక సాయం అందజేత**

**శంఖవరం అక్టోబరు 12 మనం ప్రతినిధి:** అనారోగ్యంతో మృతి చెందిన చిట్టుమూరి రావయ్యమ్మ కుటుంబానికి జనసేన పార్టీ నాయకులు అండగా నిలిచారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం, శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన రావయ్యమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, శంఖవరం మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులు చిట్టుమూరి ప్రభుదాస్, చిట్టుమూరి ప్రియ, చిట్టుమూరి కామరాజు, చిట్టుమూరి చిన్నయ్యమ్మ తదితరులను కలిసి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబానికి అవసరమైన సమయంలో అండగా నిలవాలనే ఉద్దేశంతో 50 కిలోల బియ్యంతో పాటు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఆపదలో ఉన్న కుటుంబాలను పరామర్శించి, వారికి చేతనైన సహాయం అందించడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకోవచ్చని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో శివకోటి ప్రసాద్, నొక్కి వీరబాబు, కోరాడ జానుబాబు, కానేటి అభి, కోటిపల్లి నీలకంఠం, మోసి, తలపంటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



# ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘన విజయం ఖాయం!

## డిల్లీ నుండి గల్లి వరకు కూటమిదే హవా.

## బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి.



**మార్కాపురం,అక్టోబర్ 12(మనం న్యూస్):** కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, స్థానిక సంస్థల్లోనూ బీజేపీ-ఎన్డీఏ కూటమి ప్రజల మద్దతుతో అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ట్రిపుల్ ఇంజిన్ పాలన ఏర్పడి అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు భారీ విజయం సాధించడం ఖాయమని ఆయన జోష్యం చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమం, పారిశ్రామిక ప్రగతి, డిజిటల్ సేవలు, రహదారుల నిర్మాణం వంటి రంగాల్లో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్లోనూ అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతం లభిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో అమరావతి రాజధాని అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు, రహదారులు, రైల్వేలు, పారిశ్రామిక పెట్టుబడులు, సాగునీటి ప్రాజెక్టులు వంటి కీలక అంశాలపై సమన్వయంతో ముందుకు సాగడం ద్వారా రాష్ట్ర ప్రగతికి బలమైన పునాది ఏర్పడుతుందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుభవం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యలపై చూపుతున్న చొరవ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం బలోపేతం కావడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, తాగునీరు, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, వీధి దీపాలు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నాయకత్వంలో పార్టీ శ్రేణులు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్తూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నాయని తెలిపారు. కూటమి భాగస్వాముల మధ్య సమన్వయం, కార్యకర్తల కృషి, ప్రజల విశ్వాసం స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి కీలకమవుతాయని పేర్కొన్నారు.

స్థానిక సంస్థలు ప్రజలకు ప్రభుత్వ సేవలు నేరుగా అందించే కీలక వ్యవస్థలని, గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో వాటి పాత్ర అత్యంత ముఖ్యమని ఆయన అన్నారు. కేంద్రం, రాష్ట్రం, స్థానిక సంస్థల మధ్య సమర్థవంతమైన సమన్వయం ఉంటే అభివృద్ధి పనుల అమలు వేగవంతమవుతుందని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు మరింత సమర్థంగా చేరుతాయని వివరించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, ప్రతి పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నదే ఎన్డీఏ కూటమి లక్ష్యమని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజల ఆశీర్వాదం లభిస్తుందని, ఆంధ్రప్రదేశ్ లో ట్రిపుల్ ఇంజిన్ పాలన ద్వారా సమగ్ర అభివృద్ధికి మరిన్ని అవకాశాలు ఏర్పడతాయని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి రామచంద్రారెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.

# పట్టణాలు ధీటుగా గ్రామాలే లక్ష్యం

## అభివృద్ధి పై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

## రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

ఏలూరు/ఆగిరిపల్లి, అక్టోబరు12,(మనం ప్రతినిధి): ఆగిరిపల్లి మండలం కృష్ణవరం గ్రామంలో సోమవారం సాయంత్రం రూ 80 లక్షలు వ్యయంతో చేపట్టనున్న కమ్యూనిటీ హాలు, రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులకు, ఆగిరిపల్లి గ్రామంలో రూ 20 లక్షలు వ్యయంతో నిర్మించనున్న ముదిరాజుల కమ్యూనిటీ హాలుకు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి భూమి పూజలు, శంకుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరించారు. గ్రామస్థులు పూలజల్లుతో, బాణా సంచాలు పేల్చి ఘనస్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులను ఇచ్చి మంత్రి నుదుటిన మహిళలు కుంకుమ తిలకం దిద్దారు. గ్రామాల్లో మిగిలిన అభివృద్ధికార్యక్రమాలు దశలు వారీగా చేస్తానని, అర్హులు అందరికీ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు మంజూరు చేస్తామని మంత్రి హామీఇచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ పట్టణాలు ధీటుగా గ్రామాలు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాలు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామాల్లో మిగిలి ఉన్న పనులు దశలు వారీగా పూర్తి చేస్తామని తెలిపారు. వర్షాకాలంలో నీటి నిల్వలు, పారుదల సమస్యలను అధిగమించేందుకు డ్రైనేజీ, కల్వర్టులు నిర్మాణం ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలు అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.



నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలు ప్రజలకు శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకు నేందుకు కమ్యూనిటీ హాలు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కూటమి నాయకులు, గంగిరెద్దులు సంఘ నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## రష్యా-ఉక్రెయిన్ ఒప్పందం..

# తనకు తెలియదన్న జెలెన్స్కీ

**కీవ్, అక్టోబర్ 12 :** రష్యా, ఉక్రెయిన్ మధ్య తక్షణమే ఇంధన వనరుల కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం ప్రకటించారు. విద్యుత్, చమురు, గ్యాస్ వంటి ఇంధన మౌలిక సదుపాయాలపై పరస్పర దాడుల నిలిపివేతకు ఇరుపక్షాలూ అంగీకరించాయన్నారు. ఈ ప్రకటనపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ స్పందించారు. ఈ విషయం తనకు ముందుగా తెలియదన్నారు. మీడియాలో వచ్చిన వార్తలు చూసే తాను తెలుసుకున్నట్లు చెప్పారు. అయితే ఇది మంచి పరిణామమేనని పేర్కొన్నారు. ఈ ఒప్పందానికి రష్యా కట్టుబడి ఉంటే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. తమ ఇంధన సదుపాయాలపై మాస్కో దాడులు ఆపిన వెంటనే.. తాము కూడా ఆ దేశ చమురు శుద్ధి కర్మాగారాలపై దాడులు నిలిపివేస్తామని జెలెన్స్కీ వెల్లడించారు. ఉద్రిక్తతలను తగ్గించే ఏ చర్యలైనా ఇరుపక్షాల నుంచి ఉన్నప్పుడే శాంతి స్థాపన సాధ్యమవుతుందన్నారు. కాగా.. ట్రంప్ ప్రకటనపై అటు రష్యా ఇప్పటి వరకూ స్పందించలేదు సరికదా.. ప్రకటన అనంతరం ఉక్రెయిన్లోని పలు ప్రాంతాలపై దాడులు చేపట్టడం గమనార్హం. దేశ రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాల్లోని విద్యుత్ కేంద్రాలపై డ్రోన్ దాడులు జరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ వెల్లడించారు. ఖర్కీవ్లో ఒక దుకాణంపై జరిగిన దాడిలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. 20 మందికి పైగా గాయపడినట్లు తెలిపారు. ఇకనైనా దాడులు ఆపకపోతే రష్యా తీవ్ర పర్యవసానాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## సౌదీలోని దమ్మామ్ ఎయిర్పోర్టుపై

# హూతీల భీకరదాడి



**రియాద్, అక్టోబర్ 12 :** సౌదీ అరేబియాలోని దమ్మామ్లోని కింగ్ ఫహాద్ అంతర్జాతీయ ఎయిర్పోర్టుపై ఆదివారం అర్ధరాత్రి హూతీ రెబల్స్ క్షిపణులతో విరుచుకుపడ్డారు. దమ్మామ్లో జరిగిన దాడిలో నష్టం వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. మరోవైపు రియాద్లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై కూడా రెండో విడత దాడి చేశారు. ఈ దాడిలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు.

దమ్మామ్ విమానాశ్రయం రియాద్కు 410 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది అరేబియన్ గల్ఫ్ తీరంలో కీలక పారిశ్రామిక నగరం. దీనికి తోడు ఇక్కడి ఎయిర్పోర్టు కీలక ఏవియేషన్ హబ్.

**సౌదీ అరేబియాలో ఎయిర్పోర్టులకు వెళ్లొద్దు: హూతీలు**

సౌదీ అరేబియా ఎయిర్పోర్టులకు ప్రయాణికులు, విమానాలు వెళ్లొద్దని హూతీలు హెచ్చరికలు జారీ చేశారు. తమపై సౌదీ దాడులు నిలిపివేసే వరకు తాము వెనక్కి తగ్గమన్నారు. సౌదీకి మరింత భయానక పరిస్థితి రానుందని పేర్కొన్నారు.

**చర్చలతోనే పరిష్కారం: ఇరాన్**

సౌదీ-హూతీలు చర్చలతోనే సమస్యలు పరిష్కరించుకోవాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. తమకు పొరుగుదేశాలతో యుద్ధాలు చేయాలన్న కోరికలేదని పేర్కొన్నారు. హూతీలు పూర్తిగా స్వతంత్ర వైఖరితోనే పనిచేస్తున్నారన్నారు. సౌదీపై దాడులకు ఇరాన్ ప్రోత్సహించిందన్న వాదనలు వస్తున్న నేపథ్యంలో అరాగ్చీ స్పందించారు.

రియాద్ ఎయిర్పోర్ట్పై దాడిని టర్కియే తీవ్రంగా ఖండించింది. ఇవి అంతర్జాతీయ చట్టాలకు పూర్తిగా వ్యతిరేకమని పేర్కొంది. వీటిని తక్షణమే నిలిపేయాలని డిమాండ్ చేసింది. సౌదీకి తాము పూర్తిగా అండగా నిలుస్తామని ప్రకటించింది.

సౌదీకి అత్యవసరమైతే తప్ప తమ దేశ ప్రజలు వెళ్లొద్దని యూకే ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది. ముఖ్యంగా జెడ్డా, దమ్మామ్, మదీనా ఎయిర్పోర్టులకు వెళ్లే విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది.

## కండక్టర్గా జీవితమే

# బాగుండేది

## సూపర్ స్టార్ రజనీకాంత్



**చెన్నై, అక్టోబర్ 12 :** బస్సు కండక్టర్గా జీవితాన్ని ప్రారంభించి, ఆ తరువాత నటుడిగా మారారు రజనీకాంత్. దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తూ సూపర్ స్టార్ గా ఎదిగారు. రజనీకాంత్లో అభిమానులకు నచ్చేది తన నటన మాత్రమే కాదు, ఎంత ఎత్తుకు ఎదిగినా వినయంతో ఒదిగి ఉండే ఆయన వ్యక్తిత్వం. ఎన్నో సందర్భాల్లో తన జీవిత ప్రయాణం గురించి మాట్లాడిన ఆయన, తాజాగా మరోసారి బెంగళూరులో బస్సు కండక్టర్గా చేసినప్పటి రోజులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం నటుడిగా అగ్రస్థాయిలో ఉన్నప్పటికీ, కండక్టర్గా పనిచేసినప్పుడే ఎక్కువ సంతోషంగా ఉండేవాడినని తెలిపారు. 'జైలర్ 2' ప్రచార కార్యక్రమంలో చిత్ర దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ, రజనీకాంత్లోని వినయం గురించి ప్రస్తావించారు. దీనికి రజనీ స్పందిస్తూ తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. "నేను స్టార్ను అయినప్పటికీ, నాకు నటనంటే ఇష్టం. అయితే అంతకంటే బస్సు కండక్టర్గా పనిచేయడమే ఇంకా ఇష్టం. నేను అయిదేళ్ల పాటు కండక్టర్గా పనిచేశాను. ఇప్పటికీ ఆ ఉద్యోగాన్ని మిస్ అవుతుంటాను. నేను తరచూ బెంగళూరు వెళ్లేది కూడా అందుకే. నన్ను నేను ఎప్పుడూ ఓ స్టార్గా భావించలేదు. ఇప్పటికీ బస్సు కండక్టర్గానే భావిస్తుంటాను. అలాంటప్పుడు, నాలాంటి ఓ బస్సు కండక్టర్ మీలాంటి పెద్ద వ్యక్తి ముందు ఎలా ప్రవర్తిస్తారు చెప్పండి?" అని రజనీకాంత్ అన్నారు. ఈ వ్యాఖ్యలతో ఆయన వ్యక్తిత్వం ఎంత గొప్పదో మరోసారి అర్థమైందని అభిమానులు చర్చించుకుంటున్నారు.

# వైమానిక దాడిలో 13 మంది మృతి

## సూడాన్-ఈజిప్టు సరిహద్దు బంగారు గని వద్ద ఘటన

**కైరో, అక్టోబర్ 12 :** సూడాన్-ఈజిప్టు సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఓ వైమానిక దాడిలో 13 మంది బంగారు గని కార్మికులు మృతి చెందారని ఓ వైద్య బృందం ప్రకటించింది. దాడి జరిగిన ప్రాంతంలో సంప్రదాయ పద్ధతుల్లో చిన్నతరహా బంగారం తవ్వకాలు విస్తృతంగా జరుగుతుంటాయి. సూడాన్-ఈజిప్టు-లిబియా మధ్య ప్రాంతంలో శనివారం జరిగిన ఈ వైమానిక దాడుల్లో మరో 28 మంది గాయపడ్డారని సూడాన్ వైద్యుల నెట్వర్క్ వివరించింది. ఈ దాడులు ఎవరి పని అనేది ఇప్పటి వరకూ తెలియరాలేదు. తమ దేశానికి చెందిన ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్లాలంటూ బంగారం తవ్వకాలకు పాల్పడుతున్న వారిని ఈజిప్టు అధికారులు పలుమార్లు హెచ్చరించారని నెట్వర్క్ తెలిపింది. సూడాన్లో యుద్ధానికి బంగారం కీలక ఆధారంగా ఉంది. ఈ క్రమంలో డార్ఫర్, కోర్డోఫాన్ ప్రాంతాల నుంచి వందల టన్నుల బంగారాన్ని తిరుగుబాటు పారామిలిటరీ దళమైన 'రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్' అక్రమంగా రవాణా చేసింది.



# పినరయిపై రెండు ఎఫ్ఐఆర్లు



**తిరువనంతపురం, అక్టోబర్ 12 :** కేరళం మాజీ ముఖ్యమంత్రి, ఆ రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత పినరయి విజయన్కు బిగ్ షాక్ తగిలింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ ముడుపుల కేసులో ఆయనతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో రెండు ఎఫ్ఐఆర్లు నమోదు చేసింది. సోమవారం ఈ కేసులు నమోదు చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో పినరయి విజయన్ను మొదటి నిందితుడిగా, ఆయన కుమార్తె వీణా టీని రెండో నిందితురాలిగా పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కేరళ హైకోర్టు కేసు నమోదు చేయాలని ఆదేశించడంతో విజిలెన్స్ అధికారులు దర్యాప్తు బాధ్యతలు చేపట్టారు.

**అల్లుడిపైనా మరో కేసు..**

విజయన్ అల్లుడిపైనా విజిలెన్స్ మరో కేసు నమోదు చేసింది. అవినీతి ద్వారా అక్రమంగా ఆస్తులు కూడబెట్టడంతో పాటు, వాటిని అక్రమ మార్గాల్లో యూఏఈకి తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులోనూ వీణాను రెండో నిందితురాలిగా చేర్చినట్లు సమాచారం. రెండు కేసుల దర్యాప్తు కోసం విజిలెన్స్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయనుంది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కేసులు నమోదు చేసిన అధికారులు, ఆరోపణలకు సంబంధించిన అంశాలపై విచారణ చేపట్టనున్నారు. ఈ ఆరోపణలు ఇంకా దర్యాప్తు దశలోనే ఉన్నాయి.

# సుప్రీం కోర్టు ముట్టడికి ప్రతిపక్షాల యత్నం.. ఢిల్లీలో భారీ బందోబస్తు

**ఢిల్లీ, అక్టోబర్ 12 :** దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ వేడి రాజుకుంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీనామా చేయాలని, ఈవీఎంలను రద్దు చేసి బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్లతో ఇండియా కూటమి 'చలో ఢిల్లీ: ప్రజాస్వామ్యం కోసం మార్చ్' పేరిట భారీ ఆందోళనకు పిలుపునిచ్చింది. కన్నాట్ ప్లేస్ నుంచి సుప్రీం కోర్టు వరకు ర్యాలీగా వెళ్లి చీఫ్ జస్టిస్ సూర్యకాంత్కు వినతిపత్రం అందజేయాలని ప్రతిపక్ష నేతలు నిర్ణయించగా, భేటీకి సీజేఐ నిరాకరించారు.



# పూంచ్లో భారీ పేలుడు

## లష్కరే కమాండర్ సహా నలుగురు ఉగ్రవాదులు మృతి



**జమ్ము, అక్టోబర్ 12 :** జమ్ముకశ్మీర్లోని పూంచ్ జిల్లా క్రిష్ణా ఘాటీ సెక్టార్లో జరిగిన భారీ పేలుడులో లష్కర్-ఇ-తైబా ఉగ్రవాద సంస్థకు చెందిన టాప్ కమాండర్తో సహా నలుగురు చొరబాటుదారులు దుర్మరణం చెందారు. నియంత్రణ రేఖ వెంబడి నాంగీ టెక్రి ప్రాంతం గుండా భారత్లోకి చొరబడేం దుకు ఈ ఉగ్రమూక యత్నించింది. ఈ క్రమంలో భద్రతా బలగాలు ఏర్పాటు చేసిన పటిష్టమైన యాంటీ-ఇన్ఫిల్ట్రేషన్ గ్రిడ్లో భాగంగా అమర్చిన ల్యాండ్మైన్ ఒక్కసారిగా పేలింది. ఈ ఘటనలో నలుగురు ఉగ్రవాదులు అక్కడికక్కడే మృతి చెందారు. పేలుడు ఘటనలో మృతి చెందిన వారిలో లష్కర్-ఏ-తైబా టాప్ కమాండర్ మొహమ్మద్ ఫైజాన్తో పాటు వకాస్, ఇస్తియాక్, ఆసిమ్లుగా గుర్తించారు. సోమవారం ఉదయం క్రిష్ణా ఘాటీ సెక్టార్లోని సత్వాల్-నాకి ప్రాంతంలో ఈ పేలుడు సంభవిం చినట్లు అధికారులు వెల్లడిం చారు. ఈ ఘటనతో అప్రమత్తమైన సైన్యం సరిహద్దు వెంబడి భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. కాగా, మెంధార్ సెక్టార్లోనూ మరికొన్ని ల్యాండ్మైన్లను గుర్తించిన బలగాలు వాటిని నిర్వీర్యం చేశాయి. సరిహద్దులో ఉగ్రవాదుల చొరబాటుయ త్నాలు నిరంతరం కొనసాగుతున్నప్పటికీ, మన బలగాల పటిష్ఠ నిఘా కారణంగా వారి కుట్రలు భగ్నమవుతున్నాయి.

# పంజాబ్లో సర్ ఎఫెక్ట్ 13.60 లక్షల ఓటర్ల తొలగింపు

**చండీగఢ్, అక్టోబర్ 12 :** ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) తర్వాత పంజాబ్ లో ఓటర్ల తుది జాబితాను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సోమవారం విడుదల చేసింది. సర్ ప్రక్రియలో 13.60 లక్షల ఓటర్ల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించారు. రాష్ట్రంలోని మొత్తం 117 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఓటరు తుది జాబితాను ప్రకటించారు. 7,97,263 ఓటర్లను కొత్తగా జాబితాలో చేర్చారు. అలాగే 13,60,316 మంది ఓటర్ల పేర్లను తొలగించారు. జూన్ లో పంజాబ్లో సర్ ప్రక్రియ ప్రారంభమైనపుడు మొత్తం ఓటర్ల సంఖ్య 2,14,61,043గా ఉంది. సోమవారం ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది జాబితాలో ఆ సంఖ్య 2,01,00,727గా మారింది. ఓటర్ల జాబితాలో పేరులేని ఓటర్లు ఈసీఐ యాప్ లేదా బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్ఓ) ద్వారా ఫాం6ను పూరించి రిజిస్టర్ చేసుకోవాలని ఎన్నికల అధికారులు తెలిపారు. కాగా.. 2026 జూన్ 9 నాటికి రాష్ట్రంలో మొత్తం 2,14,61,043 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 35,49,036 మందికి నోటీసులు జారీ చేశారు. వెరిఫికేషన్ తర్వాత వారిలో 86,038 మందిని అనర్హులుగా ప్రకటించారు. ఇక మొత్తం ఓటర్లు 2,01,00,727 మందిలో 1,03,76,026 మంది పురుషులుకాగా.. 97,24,195 మంది మహిళలు ఉన్నారు. 506 మంది థర్డ్ జెండర్ వర్గం వారున్నారు. ఇక సర్ ప్రక్రియ సమయంలో ఓటర్ల సౌకర్యం కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పోలింగ్ స్టేషన్లను రేషనలైజ్ చేశారు. దాంతో పోలింగ్ స్టేషన్ల సంఖ్య 24,453 నుంచి 25,332కు పెరిగింది.

## కాక్రోచ్ ఎఫెక్ట్

# ఢిల్లీ ధర్నా చౌక్ క్లోజ్

## జంతర్ మంతర్ను డీనోటిఫై చేసిన ఢిల్లీ పోలీస్



**ఢిల్లీ, అక్టోబర్ 12 :** దేశ రాజధాని ఢిల్లీలోని ప్రఖ్యాత నిరసన ప్రాంతం జంతర్ మంతర్ వద్ద ఇకనుంచి నిరసన ప్రదర్శనలు చేపట్టలేరు. ఇప్పటివరకు ప్రభుత్వ విధానాలపై వ్యతిరేకత తెలిపేందుకు కేంద్రంగా ఉన్న ఆ ప్రాంతాన్ని నిరసన ప్రదర్శనలు తెలిపే వేదిక నుంచి తొలగిస్తూ ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జంతర్ మంతర్ ను నిరసనలు తెలిపే ప్రదేశం నుంచి డీనోటిఫై చేస్తున్నామని ఆ ప్రకటనలో కమిషనర్ పేర్కొన్నారు. ఢిల్లీలో నిరసన ప్రదర్శనలు, ఆందోళనలు, బైఠాయింపులు వంటి కార్యక్రమాలు నిర్వహించడానికి మూడు ప్రదేశాలను ఆయన వెల్లడించారు. అవే.. రామ్ లీలా గ్రౌండ్, బురారీ గ్రౌండ్, ఈస్ట్ ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్ అని పేర్కొన్నారు. ఇక నుంచి ఆ మూడు ప్రాంతాలలోనే ఆందోళలు, ప్రదర్శనలు, బైఠాయింపులు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం త్వరలోనే వేర్వేరుగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ను విడుదల చేస్తామని తెలిపారు. కాగా, ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియలో ఓటరు జాబితాల నుంచి ఓటర్ల పేర్లను తొలగించారన్న ఆరోపణలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ)లు జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జంతర్ మంతర్ ను నిరసనలు తెలిపే ప్రాంతం నుంచి తొలగించినట్లు తెలుస్తోంది. జంతర్ మంతర్ను నిరసనలు తెలిపే ప్రాంతం నుంచి తొలగిస్తూ ఢిల్లీ పోలీసు కమిషనర్ జారీ చేసిన ప్రకటన నేపథ్యంలో ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డాయి. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలిపే అవకాశం కూడా లేకుండా చేస్తున్నారని కేంద్రంపై తీవ్రంగా విమర్శలు గుప్పించాయి. ఢిల్లీ పోలీసులు కేంద్ర హోం మంత్రిత్వశాఖ పరిధిలోకి వస్తారు. మరోవైపు తాజా నిర్ణయం నేపథ్యంలో జంతర్ మంతర్ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగనున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన పలు కీలక ప్రభుత్వ విభాగాల భవనాలు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి.

## గాయత్రీ దేవి అలంకరణలో వాసవి మాత



**మంత్రాలయం , అక్టోబర్ 12,మనం న్యూస్:** శరన్నవరాత్రోతలను పురస్కరించుకొని మంత్రాలయంలోని ఆర్యవైశ్య సేవ సంఘం ఆధ్వర్యంలో వాసవి కళ్యాణ మండపంలో రెండవ రోజు వాసవి మాత గాయత్రి దేవి అలంకరణలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా వాసవి మాతను గాయత్రీ దేవిగా అలంకరణ చేసి , ప్రత్యేక పూజలు చేసి , దీప దూప నైవేద్యాలను సమర్పించి మంగళహారతి ఇచ్చారు. భక్తులు గాయత్రి దేవి దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఉన్నారు.

## సీసీ రోడ్లు, డ్రైనేజీలు హెచ్‌డీపీఇ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**ఎమ్మిగనూరు, అక్టోబర్ 12 మనం న్యూస్:** పట్టణంలోని మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి మున్సిపల్ హెచ్ ఎ ఎం పథకం కింద వివిధ వార్డుల్లో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, హెచ్ డి పి ఇ తాగునీటి పైప్లైన్లు, ప్రహరీ గోడలు, వాక్ ట్రాకర్లు, పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు 18వ వార్డు - ఖుబులా కాలనీ: ఉర్దూ ఫంక్షన్ హాల్ వద్ద పైప్లైన్, 20వ వార్డు - ఉప్పర కాలనీ: వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో పైప్లైన్, 34వ వార్డు - లక్ష్మీపేట: పాత టీడీపీ కార్యాలయం లైన్, లక్ష్మమ్మ ఆలయం లైన్, పెద్దబావి లైన్లలో సీసీ రోడ్లు మరియు పైపులైన్లు, 21వ వార్డు: మమత మెడికల్ షాప్ లైన్ వద్ద ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణానికి ప్రహరీ గోడ నిర్మాణం, గుడికల్ రోడ్డులో ఫిల్ట్రేషన్ ప్లాంట్ అభివృద్ధి పనులు, 24వ వార్డు యస్ యం టి



కాలనీ: శారద విద్యానికేతన్ వద్ద పైప్లైన్, 26వ వార్డు నెహ్రూ నగర్: పైప్లైన్, 27వ వార్డు: మసీదు, చర్చి సమీపంలో పైప్లైన్, 29వ వార్డు శిల్పా కాలనీ: పార్కుకు ప్రహరీ గోడ, వాకింగ్ ట్రాక్ నిర్మాణం, మిలిటరీ కాలనీ: సీసీ రోడ్ల నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పట్టణంలోని ప్రతి వార్డులో రహదారులు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, ప్రజా సౌకర్యాలను మెరుగుపరచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, ఎమ్మిగనూరు పట్టణాన్ని మరింత అభివృద్ధి చెందిన, పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, డీఈలు మరియు సిబ్బంది, రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ పట్టణ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సుంకులా పరమేశ్వరి అమ్మవారు గాయత్రీ దేవిగా దర్శనం

### కే. నాగలాపురంలో ఘనంగా దసరా నవరాత్రి ఉత్సవాలు



**గూడూరు, అక్టోబర్ 12 (మనం న్యూస్):** కర్నూలు జిల్లా గూడూరు మండలం కే. నాగలాపురం గ్రామంలో కొలువుదీరిన శ్రీ సుంకులా పరమేశ్వరి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మహా హోమాలు నిర్వహించిన అనంతరం శ్రీ సుంకులా పరమేశ్వరి అమ్మవారిని గాయత్రీ దేవిగా విశేషంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునే ందుకు వచ్చిన భక్తులకు ఆలయ అధికారులు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) రాధాకృష్ణ ఆధ్వర్యంలో, ఆలయ వైస్ చైర్మన్ గోపాల్రెడ్డి సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తలారి సుజాత, బండారి లక్ష్మీదేవి, లబ్బు అనిత, మద్దమ్మ, వెంకటరాముడు, ఏరకలి మద్దమ్మ, ఎక్స్ అఫీషియో సభ్యులు, అర్చకులు కృష్ణ, గ్రామ పెద్దలు తిరుపాల్, సుంకన్న, వేద పండితులు ప్రసాద్ శర్మ, ఆలయ అర్చకులు మధుసూదన్, భాస్కర్, సురేష్, ఆలయ సిబ్బంది కేశవ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ మేయర్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ సతీమణి యం సుశీల?

- కర్నూలు నగర రాజకీయాల్లో ఆసక్తికర చర్చ
- నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన శిఖామణి కుటుంబానికి రాజకీయ నేపథ్యం



**కర్నూలు, అక్టోబర్ 12 (మనం న్యూస్):** కర్నూలు నగరపాలక సంస్థ మేయర్ పదవికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున మాజీ ఎమ్మెల్యే ఎం. మణిగాంధీ సతీమణి యం సుశీల పేరు పరిశీలనలో ఉందా? అన్న అంశం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మేయర్ అభ్యర్థిత్వానికి సంబంధించి ఆమె పేరు తెరపైకి వచ్చినట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై పార్టీ అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం మాజీ ఎమ్మెల్యే ఎం. మణిగాంధీ కుటుంబానికి కోడుమూరు నియోజకవర్గ రాజకీయాలతో సుదీర్ఘ అనుబంధం ఉంది. ఆయన తండ్రి దివంగత ఎం. శిఖామణి కోడుమూరు నియోజకవర్గం నుంచి పలుమార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజాప్రతినిధిగా పనిచేశారు. తండ్రి మరణానంతరం రాజకీయాల్లోకి వచ్చిన మణిగాంధీ 2014లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున భారీ మెజారిటీ తో కోడుమూరు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014 నుంచి 2019 వరకు ఎమ్మెల్యేగా పనిచేశారు. ఈ నేపథ్యంలో మణిగాంధీ సతీమణికి కర్నూలు మేయర్ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తారా? అన్న ప్రశ్న రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. నగరపాలక సంస్థ రాజకీయాల్లో వైసీపీ అనుసరించే వ్యూహం, అభ్యర్థుల ఎంపికలో పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయాలు కీలకం కానున్నాయి. అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపులు మేయర్ అభ్యర్థిత్వంపై పార్టీ నాయకత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడే వరకు ఎవరికి అవకాశం దక్కుతుందనే అంశంపై స్పష్టత రానుంది. మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ కుటుంబానికి ఉన్న రాజకీయ నేపథ్యం ఈ చర్చకు ప్రాధాన్యతను తీసుకొచ్చింది. అయితే, మణిగాంధీ సతీమణి యం సుశీల పేరును వైసీపీ మేయర్ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు అధికారిక నిర్ధారణ లేదు. పార్టీ ప్రకటన వెలువడిన తర్వాతే అభ్యర్థిత్వంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## భుజంపై శవం.. విధి నిర్వహణలో అంకితభావం



**మంత్రాలయం , అక్టోబర్ 12,మనం న్యూస్:** తుంగభద్ర నదిలో మహిళ శవాన్ని 2 కీలో మీటరు వరకు తన భుజం పై తీసుకువచ్చిన మంత్రాలయం కానిస్టేబుల్ రంగస్వామి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. వివరాల్లోకి వెళ్తే కర్ణాటక రాష్ట్రం మల్లవెల్లి గ్రామానికి చెందిన జయశీల (40) కుటుంబ కలహాలతో మంత్రాలయం లోని తుంగభద్ర నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. అయితే ఆదివారం మృతదేహం బయటకు పడడంతో కొంతమంది తో కలిసి ఒడ్డుకు చేర్చారు. అక్కడ నుంచి మహిళ మృతదేహాన్ని అంబులెన్స్ లో ఎక్కించేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో దాదాపు రెండు కీలో మీటర్ల వరకు మహిళ శవాన్ని తన భుజం పై మోసుకొని వచ్చి అంబులెన్స్ ఎక్కించి ,అందరికి ఆదర్శంగా నిలిచారు. దీంతో ,గ్రామస్తులు , కొంతమంది ప్రముఖులు , సోషల్ మీడియా , నెటిజన్లు ఆయన కు అభినందనలు తెలిపారు.

## కల్తీ కల్లు చేయకూడదు

**నందికొట్కూర్(మనం న్యూస్):** గ్రామీణ ప్రాంతాల్లో కల్లు దుకాణదారులు కల్తీకల్లు అమ్మకూడదని రవికుమార్ తెలియజేశారు. నంద్యాల జిల్లా ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి సాదు రవికుమార్ ఆదేశాల మేరకు, నందికొట్కూరు ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో సోమవారం నందికొట్కూరు ఎక్సైజ్ స్టేషన్లో కల్లు సొసైటీ మరియు కల్లు లైసెన్సు పొందిన దుకాణ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ సమావేశంలో నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా మరియు మిడ్తూరు 4 మండలాల పరిధిలోని కల్లు సొసైటీ లైసెన్సు పొందిన దుకాణ యజమానులు మరియు కల్లు అంగడి లైసెన్సుదారులు పాల్గొన్నారు.సమావేశంలో చర్చించిన ముఖ్యమైన అంశాలు

కల్తీ నివారణలో భాగంగా కల్లు అంగడి లైసెన్సుదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ కల్లులో ఎలాంటి కల్తీ చేయకూడదని హెచ్చరించడం జరిగింది.ప్రభుత్వ నిబంధనలు మెరకు ప్రభుత్వం కేటాయించిన ఈత చెట్ల నుండి మాత్రమే నిబంధనలకు లోబడి కల్లును సేకరించి



విక్రయించాలని స్పష్టం చేశారు.లైసెన్స్ కాపీలో పేర్కొన్న బౌండరీల (హద్దుల) పరిధిలోనే కల్లు అంగడి నిర్వహించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలుంటాయని సమావేశంలో తెలియజేశారు.ఈ సమావేశంలో నందికొట్కూరు ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ రామాంజనేయులు, ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ భాష్యం శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ శేఖరయ్య నాయకుడు పాల్గొన్నారు.

## మద్దిలేటి స్వామి సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు

- బాలా త్రిపుర సుందరి గా భక్తులకు దర్శనం

**బేతంచేర్ల అక్టోబర్ 12 (మనం న్యూస్)** మండల పరిధిలో ఆర్ఎస్ రంగాపురం గ్రామం సమీపంలో ఉన్న శ్రీ ఘన మద్దిలేటి నరసింహ స్వామి దేవస్థానం శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రెండవ రోజు మహాలక్ష్మి అమ్మవారి కి పూజలు నిర్వహించారు బాలా త్రిపుర సుందరి గా పట్టు వస్త్రాలు ఆభరణాలు మరియు పూలతో అలంకరించారు ఈ కార్యక్రమాలు డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు ధర్మకర్తల మండలి చైర్మన్ ఎల్ల నాగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు వేద పండితులు అర్చక స్వాములు మరియు భక్తులు మరియు ఘనంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు



## నీళ్ల ట్యాంకి ట్రాక్టర్ బోల్తా



- జార్ఖండ్‌కు చెందిన వ్యక్తి మృతి

**బేతంచేర్ల, అక్టోబర్ 12( మనం న్యూస్):** మండల పరిధిలో గుటుపల్లె గ్రామం సమీపంలో నీళ్ల ట్యాంకి ట్రాక్టర్ బోల్తా జార్ఖండ్ చెందిన వ్యక్తి మృతి ఎస్సై రమేష్ బాబు తెలిపిన వివరాల మేరకు ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్న జార్ఖండ్ చెందిన హర్ధన్ ముర్మ 24స,, అనే వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్నారు గూటి పల్లె గ్రామం సమీపంలో నీళ్ల ట్యాంకి ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడటంతో వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో వ్యక్తి మృతి చెందాడని తెలిపారు.

## కర్నూలు మేయర్ అభ్యర్థిగా బి. విజయ ప్రత్యూష?

- మంత్రి టీజీ భరత్ అనుచర వర్గం నుంచి పేరు తెరపైకి!
- దివంగత మాజీ కార్పొరేటర్ బో ల్లెద్దుల రామకృష్ణ కుమార్తెపై రాజకీయ వర్గాల్లో చర్చ



**కర్నూలు, అక్టోబర్ 12 (మనంన్యూస్):** కర్నూలు నగరపాలక సంస్థ మేయర్ పదవికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బి. విజయ ప్రత్యూష పేరు పరిశీలనలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అనుచర వర్గానికి చెందిన విజయ ప్రత్యూషకు మేయర్ అభ్యర్థిగా అవకాశం దక్కవచ్చన్న ప్రచారం ఆసక్తి రేపుతోంది. విజయ ప్రత్యూష తండ్రి దివంగత బొ ల్లెద్దుల రామకృష్ణ గతంలో కార్పొరేటర్గా పనిచేశారు. నగర రాజకీయాలతో ఆయనకు సుదీర్ఘ అనుబంధం ఉంది. ఈ నేపథ్యంలో ఆయన కుమార్తె పేరు మేయర్ అభ్యర్థిత్వానికి సంబంధించి తెరపైకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. మేయర్ అభ్యర్థి ఎంపికలో పార్టీ అధిష్ఠానం నిర్ణయం కీలకం కానుంది. మంత్రి టీజీ భరత్ వర్గానికి చెందిన నాయకులకు పార్టీ ఎంతమేర ప్రాధాన్యం ఇస్తుంది? విజయ ప్రత్యూషకు అవకాశం కల్పిస్తుందా? అనే అంశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. దీనిపై పార్టీ అధికారిక ప్రకటన వెలువడితేనే స్పష్టత రానుంది. అయితే, విజయ ప్రత్యూష పేరును మేయర్ అభ్యర్థిగా పార్టీ అధికారికంగా ప్రకటించినట్లు ఇప్పటివరకు ఎలాంటి నిర్ధారణ లేదు. దీంతో ఆమె అభ్యర్థిత్వంపై జరుగుతున్న ప్రచారం నగర రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## బనవాసి ఫారంలో ప్రభుత్వ వసతిగృహం ఏర్పాటు చేయాలి

**ఎమ్మిగనూరు, అక్టోబర్ 12 మనం న్యూస్:** మండల పరిధిలోని బనవాసి ఫారం లో చుట్టుపక్క గ్రామాల విద్యార్థుల కోసం ప్రభుత్వ హైస్కూల్,కాలేజ్,విద్యార్థి సంక్షేమ వసతి గృహం నిర్మించాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి జి నల్లారెడ్డి యాదవ్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్,రాయలసీమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుంకన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండలం బనవాసి ఫారంలో దాదాపు 3500 ప్రభుత్వ భూమి కలదు అందులో ప్రభుత్వం అనేకకార్యాలయాలు, పరిశ్రమలు ఏర్పాటు చేయనుంది అయితే ఫారం



చుట్టు పక్కన 15గ్రామాలు కలవు ఆయా గ్రామాలలో హై స్కూల్స్ లేకపోవడంతో వేలాది మంది విద్యార్థులు ఎమ్మిగనూరుకు వెల్లిరావాల్సిన పరిస్థితి ఉంది అయితే గ్రామాలకు సమయానికి బస్సులు లేక విద్యార్థులు మద్య లోనే చదువుకు దూరమవుతున్నారని చుట్టు పక్కల గ్రామాలైన బనవాసి ,ఫారం ,పరమాన్ దొడ్డి, నక్కలమిట్ట, బోడబండ ,చెన్నా పురం ,దేవిబెట్ట ,కోటేకల్ , మల్కపురం ,బసాపురం గ్రామాలు తో పాటు పెద్దకడుబూరు మండలం రాగిమాన్ దొడ్డి, గంగుల పాడు గ్రామాల విద్యార్థులు ఎమ్మిగనూరు కు వెళ్ళి చదువుతున్నారని కావున బనవాసి ఫారంలో ప్రభుత్వ హైస్కూల్,కాలేజ్,సంక్షేమ హాస్టల్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ గారు,డిఈఓ గారు ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులు కష్టాలు తీర్చాలని విజ్ఞప్తి చేసారు. జిల్లా కలెక్టర్ సిరి స్పందిస్తూ తప్ప ప్రయత్నిస్తామని తెలియజేశారు కార్యక్రమంలో నాయకులు రమేష్,వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి పరిశీలన అవసరం




- ప్రజా ఫిర్యాదుల వేదికకు 18 అర్జీలు
- నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

**కర్నూల్ కార్పొరేషన్ (మనం న్యూస్):** నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటికి సత్వర పరిష్కారం చూపేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని, పరిష్కారానికి సమర్థవంతమైన చర్యలు చేపట్టవచ్చని పేర్కొన్నారు.స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 18 అర్జీలను స్వీకరించారు. అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదుకు ప్రాధాన్యతనిస్తూ, నిబంధనల మేరకు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్.ఈ. రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, డీసీపీ శబ్నం శాస్త్రీ, ఏసీపీ నాగరాజు, మేనేజర్ జునైద్, ఆర్వోలు క్రిస్టోఫర్, వాజిద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## నేడు ఏపీకి తమిళనాడు సీఎం



**(అమరావతి, మనం ప్రతినిధి):** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ రేపు ఏపీలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకోనున్న ఆయన, సాయంత్రం 4:15 గంటలకు ఏపీ సీఎం చంద్రబాబుతో సమావేశం కానున్నారు. ఈ భేటీలో పలు కీలక రాజకీయ, అభివృద్ధి అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. అనంతరం సాయంత్రం 6 గంటలకు విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకుని, రాత్రి 8:30 గంటలకు చెన్నైకి తిరుగు ప్రయాణం కానున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కురువల సత్తా ఏమిటో చూపిద్దాం!

### ఐక్యంగా ఉండి హక్కుల సాధనకు కృషి చేద్దాం

### కురువ సంఘం నాయకుల పిలుపు..

### గడివేముల మండల నూతన కమిటీ ఎన్నిక



**గడివేముల, అక్టోబర్ 12 (మనం న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో కురువల ఐక్యతను, బలాన్ని చాటిచెప్పాలని ఉమ్మడి కర్నూలు జిల్లా కురువ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. కురువ కులస్థులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ, తమ హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని సూచించారు. నంద్యాల జిల్లా గడివేముల మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కురువ సంఘం సర్వసభ్య సమావేశంలో నాయకులు మాట్లాడారు.

ఈ సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లా కురువ సంఘం అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, జిల్లా ఉపాధ్యక్షులు కత్తి శంకర్, ధనుంజయ, వెంకటేశ్వరులు, ప్రధాన కార్యదర్శి ఎం.కె. రంగస్వామి మాట్లాడుతూ.. కురువ కులస్థులపై దాడులకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. సమాజంలో ఐక్యంగా ఉంటూ తమ సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి, ఉన్నత స్థానాలకు చేరుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కె.సి. నాగన్న, జిల్లా నాయకులు పాపారాయుడు, బి.సి. తిరుపాల్, వెంకటేశ్వర్లు, గడివేముల మండలానికి చెందిన కురువ సంఘం నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నారాయణ విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలి



**కర్నూలు, అక్టోబర్ 12 (మనం న్యూస్):** దసరా సెలవుల్లో వర్క్షాప్ పేరుతో తరగతులు నిర్వహిస్తున్న నారాయణ విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరిని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్. ఈరేష్, జిల్లా కార్యదర్శి బి. రంగస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు దసరా సెలవులు ప్రకటించిందని తెలిపారు. అయితే నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా వ్యవహరిస్తోందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు ఎస్. అభిషేక్, నగర కార్యదర్శి సి. అశోక్, జిల్లా సమితి సభ్యుడు మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ‘బాహుబలి కాదు.. నాకు బాగా తృప్తినిచ్చిన సినిమా అదే’: రాజమౌళి



తెలుగు చిత్రసీమలోనే కాకుండా అంతర్జాతీయంగా ఎంతో క్రేజ్ ఉన్న దిగ్గజ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్లో వస్తున్న ‘వారణాసి’ చిత్రం ప్రస్తుతం శరవేగంగా రూపుదిద్దుకుంటోంది. ఈ ఏడాది చివరికల్లా పూర్తిస్థాయి చిత్రీకరణను ముగించి, వచ్చే ఏడాది సమ్మర్ (వేసవి) కానుకగా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్రబృందం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో తాజాగా ఓ ప్రముఖ మీడియా ఛానల్ ప్రతినిధితో మాట్లాడిన రాజమౌళి, తన సినీ ప్రయాణానికి సంబంధించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ.. ‘ప్రపంచవ్యాప్తంగా అందరూ నన్ను బాహుబలికి ముందు, బాహుబలికి తర్వాత అని చూస్తుంటారు. కానీ ఒక దర్శకుడిగా నాలో అసలు సిసలైన ఆత్మవిశ్వాసాన్ని నింపిన చిత్రం బాహుబలి కాదు. దానికి ముందే నేను తెరకెక్కించిన ‘ఈగ’ సినిమా అని వెల్లడించారు.

**నా జీవితంలో పెద్ద ప్రయోగం..**

‘నా లైఫ్లో నేను చేసిన అతిపెద్ద ప్రయోగం ‘ఈగ’. ఆ సినిమా నాకు అందించిన సంతృప్తి వర్ణించలేనిది. నేను భవిష్యత్తులో ఎన్ని సినిమాలు తీసినప్పటికీ, ఈగ నాకు ఎప్పటికీ చాలా ప్రత్యేకమైనదిగానే ఉంటుంది. ఒక దర్శకుడిగా నన్ను నేను ఈగకు ముందు.. ఈగకు తర్వాత అని భావిస్తాను’ అని రాజమౌళి చెప్పుకొచ్చారు. దర్శకధీరుడి నుండి వచ్చిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలోనూ, సినీ వర్గాల్లోనూ వైరల్గా మారాయి.

## ఎల్లుండే మ్యాచ్.. ఇప్పటి వరకు 25వేల టికెట్లు విక్రయం

భారత్-వెస్టిండీస్ మధ్య హైదరాబాద్ వేదికగా బుధవారం జరగనున్న టీ20 మ్యాచ్ కోసం ఇప్పటి వరకు 25 వేల టికెట్లు విక్రయించినట్లు హెచ్సీఏ వెల్లడించింది. ఉప్పల్ స్టేడియంలో గరిష్ఠంగా 55 వేల మంది మ్యాచ్ను వీక్షించే అవకాశముంది. ఈ మ్యాచ్ కోసం 2,200 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మల్కాజిగిరి సీపీ సుమతి వెల్లడించారు. స్టేడియం చుట్టూ 4 వాచ్ టీమ్లు ఉంటాయని చెప్పారు.

408 సీసీ కెమెరాలు, 2 డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. సోషల్ మీడియాలో ఫేక్ టికెట్లపైనా నిఘా ఉంచినట్లు ఆమె పేర్కొన్నారు. దాదాపు 40వేల మంది మ్యాచ్కు వచ్చే అవకాశముందని, 8వేలకు పైగా వాహనాలను సైతం పార్కింగ్ చేసుకునేలా స్థలాలను ఏర్పాటు చేశామని చెప్పారు. తొలుత ఆటగాళ్లు బంజారాహిల్స్కు అక్కడి నుంచి స్టేడియానికి వస్తారని తెలిపారు. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని, 8 షీ బృందాలు మఫ్టీలో ఉంటాయని



పేర్కొన్నారు. మ్యాచ్కు వచ్చేవాళ్లు వీలైనంత వరకు ఆర్టీసీ, మెట్రో సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మ్యాచ్కు 2 గంటల ముందు స్టేడియంలోకి అనుమతిస్తామన్నారు.

## భారత్-శ్రీలంక మ్యాచ్ వేదిక మార్పు వార్తలు.. స్పందించిన బీసీసీఐ

భారత్- శ్రీలంక మధ్య డిసెంబర్ 13న జరగనున్న తొలి వన్డే మ్యాచ్ వేదికను దిల్లీ నుంచి అహ్మదాబాద్కు మారుస్తున్నట్లు వస్తున్న కథనాలను బీసీసీఐ ఖండించింది. నిబంధనల ప్రకారమే ఆ మ్యాచ్ను దిల్లీకి కేటాయించారని, వేదిక విషయంలో ఎటువంటి మార్పు చేయలేదని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు.

‘‘దిల్లీలో జరగాల్సిన భారత్- శ్రీలంక తొలి వన్డేను అహ్మదాబాద్కు మారుస్తున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదు. బీసీసీఐ అలాంటి నిర్ణయమేదీ తీసుకోలేదు. నిర్ణీత ప్రామాణిక విధానాన్ని అనుసరించే ద్వైపాక్షిక మ్యాచ్ల వేదికలను కేటాయిస్తారు’’ అని సైకియా వివరణ ఇచ్చారు. దిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో నిర్మాణ పనులు జరుగుతున్నందున.. ఆ మ్యాచ్ను అహ్మదాబాద్కు మారుస్తున్నారనే ప్రచారం మొదలైంది. ఇదిలా ఉండగా.. భారత్ పర్యటనలో భాగంగా శ్రీలంక జట్టు మూడు వన్డేలతో పాటు మూడు టీ20ల సిరీస్ కూడా ఆడనుంది.



## యూట్యూబ్లో కోహ్లీ వీడియోలు చూసి నేర్చుకున్నా: ఆస్ట్రేలియా ఆటగాడు

భారత్-ఎతో ఇటీవల జరిగిన మూడు వన్డేల సిరీస్ను ఆస్ట్రేలియా-ఎ జట్టు 2-1 తేడాతో కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో ఆసీస్ బ్యాటర్ నాథన్ మెక్స్వీనీ ఒక సెంచరీ సహా 194 పరుగులు చేసి ‘ప్లేయర్ ఆఫ్ ది సిరీస్’గా నిలిచాడు. ఈ క్రమంలోనే అతడు తన విజయ రహస్యాన్ని వెల్లడిస్తూ.. టీమ్ఇండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ యూట్యూబ్ వీడియోలు చూసి, స్పిన్ బౌలింగ్ను ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నట్లు తెలిపాడు.

‘‘ఏ విదేశీ జట్టుకైనా భారత్లో సిరీస్ గెలవడం అంత సులభమైన విషయం కాదు. భారత్ పర్యటనకు వచ్చినప్పుడు సహజంగానే స్పిన్ బౌలింగ్ను ఎదుర్కోవడంపై ఎక్కువ దృష్టి పెట్టాల్సి ఉంటుంది. అందుకే స్పిన్నర్లను కోహ్లీ ఎలా హ్యాండిల్ చేస్తున్నాడో యూట్యూబ్ వీడియోల్లో చూశాను. అలాగే స్టీవ్ స్మిత్తోపాటు గతంలో ఇక్కడ రాణించిన ఆస్ట్రేలియన్ ఆటగాళ్ల శైలిని కూడా గమనించాను. అంతేకాకుండా విశ్లేషకుల డేటానూ అధ్యయనం చేశాను. వాటిని మైదానంలో ఆచరణలో



పెట్టి.. మంచి ఫలితాలు సాధించడం చాలా సంతోషాన్నిచ్చింది’’ అని మెక్స్వీనీ చెప్పాడు.

అంతకుముందు భారత్-ఎతో జరిగిన అనధికారిక టెస్టు సిరీస్లో తన ఆటతీరుపై స్పందిస్తూ.. ‘‘భారత్లో ఆడేటప్పుడు తొలి ఇన్నింగ్స్కు చాలా ప్రాధాన్యం ఉంటుంది. అయితే.. మ్యాచ్ సాగుతున్న కొద్దీ బ్యాటింగ్ కష్టమైంది. భవిష్యత్తులో భారత్లో ఆడే అవకాశం వస్తే టెస్టుల తొలి ఇన్నింగ్స్లోనే భారీ స్కోరుపై దృష్టి పెడతాను’’ అని తెలిపాడు. రెండు మ్యాచ్ల టెస్ట్ సిరీస్ను భారత్ 1-0తో గెలుచుకుంది. నాలుగు ఇన్నింగ్స్లో మెక్స్వీనీ (0, 35, 34, 36) పెద్దగా రాణించలేకపోయాడు.

## బ్రేకప్ అంటే బాధ కాదు..

### అక్కడే అసలైన ఎదుగుదల ఉంటుంది: అనుపమ



మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ తన గత ప్రేమాయణం, బ్రేకప్ గురించి మరోసారి స్పందిస్తూ సోషల్ మీడియాలో నెటిజన్ల దృష్టిని ఆకర్షించారు. కొద్ది రోజుల క్రితమే తన మాజీ ప్రియుడు ఎంతో విచిత్రంగా ప్రవర్తించేవాడని, తన వ్యక్తిగత విషయాలతో పాటు సినిమా కెరీర్ను కూడా కంట్రోల్ చేయడానికి ప్రయత్నించాడని చెబుతూ సంచలనం సృష్టించారు. తాజాగా, మరోసారి తన బ్రేకప్ను గుర్తు చేసుకుంటూ, జీవితంలో ఎదురైన ఆ చేదు అనుభవం గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. సాధారణంగా జీవితంలో ప్రేమ ఎంత అందంగా ఉంటుందో, ఇద్దరు వ్యక్తులు విడిపోవడం కూడా అంతే అందమైన విషయమని అనుపమ అభిప్రాయపడ్డారు.

ఒక పార్ట్నర్ తో విడిపోవడం అనేది ప్రతీ ఒక్కరి జీవితంలో ఒక సహజమైన భాగమేనని ఆమె పేర్కొన్నారు. ఒక బంధం ముగిసిన తర్వాత ఆ వ్యక్తి నుంచి మనం ఎలా దూరమవుతామో, ఆ తర్వాత రోజుల్లో మనల్ని మనం ఎలా మెరుగుపరుచుకుని ఒక మంచి వ్యక్తిగా ఎదుగుతామో అనేది కేవలం ఆ విడిపోవడంతోనే మొదలవుతుందని ఆమె వెల్లడించారు. అందుకే తన కోణంలో చూస్తే బ్రేకప్ అనేది బాధ కాదని.. అది ఎంతో అందంగానే కనిపిస్తుందని స్పష్టం చేశారు. ప్రేమలో విఫలమైనప్పటికీ ధైర్యంగా నిలబడి, తన జీవితాన్ని మరింత అందంగా మలుచుకుంటున్న అనుపమ తీరును చూసి నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

## నన్ను తక్కువగా అంచనా వేస్తే అది వాళ్ల కర్మకే వదిలేస్తా.. అదితి రావు హైదరీ



దాదాపు రెండు పదుల కాలంగా చిత్రపరిశ్రమలో కొనసాగుతున్న అదితి రావు హైదరీ, ఈ ప్రత్యేకమైన మైలురాయి వద్దకు చేరుకుంటున్న వేళ తన సినీ ప్రయాణంపై స్పందిస్తూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. అక్టోబర్ 23న తన 40వ పుట్టినరోజు జరుపుకోబోతున్న అదితి.. విజయం, ఓటములతో సంబంధం లేకుండా తన ప్రయాణం సాగుతున్నట్లు తెలిపారు. నేర్చుకున్న పాఠాలు, స్పష్టత, కృతజ్ఞతా భావంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఒకవేళ ఇప్పుడున్న తాను చిన్ననాటి తనను కలిస్తే, ఎలాంటి హడావుడి లేకుండా సంతోషంగా మనలా మనం ఉండమని సలహా ఇస్తానని అదితి చెప్పారు. బయట జరిగే విమర్శలను పట్టించుకోకుండా, మనల్ని ప్రోత్సహించే మంచి వాళ్లను నమ్మాలని అన్నారు. జీవితంలో ప్రతిదీ వెంటనే తెలిసిపోవాలని తొందరపడకూడదని, కొత్త విషయాలు నేర్చుకుంటూ ముందుకు వెళ్లాలని తెలిపారు. తప్పులు చేయడానికి ఎప్పుడూ భయపడకూడదని, ఆ తప్పుల నుంచే మనం మంచి పాఠాలు నేర్చుకుని గొప్పగా ఎదుగుతామని ఆమె వివరించారు. సినిమా రంగంలో తన ప్రయాణం ఎప్పుడూ అంత తేలిగ్గా సాగలేదని అదితి అన్నారు. ఎదురైన ఇబ్బందులను తలచుకుని బాధపడకుండా, ప్రతి అనుభవం తనకు ఎంతో నేర్పించిందని చెప్పడానికి సంతోషిస్తానని అన్నారు. ఇండస్ట్రీలో ఎదగడం కొండెక్కినంత కష్టంగా ఉంటుందని, కానీ ప్రతి అడుగు ముందుకు వేయడం వల్లనే అనుభవం వస్తుందని తెలిపారు. ఇకపై ఎవరితో పని చేయాలి, ఎలాంటి మంచి పాత్రలు ఎంచుకోవాలనే విషయంలో తనకు పూర్తి స్పష్టత ఉందని ఆమె స్పష్టం చేశారు. ఎవరైనా తప్పుడు పనులు చేస్తే లేదా తనను తక్కువగా అంచనా వేస్తే.. అది వారి కర్మకే వదిలేయాలని ఆమె అభిప్రాయపడ్డారు.

## ‘AA-23’.. ఇంట్రెస్టింగ్ అప్డేట్స్ రాబోతున్నాయంటూ పోస్ట్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ వరుస భారీ పాన్ ఇండియా ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. దర్శకుడు అట్లీతో ‘రాకా’ సినిమాతో పాటు, కోలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్తో ఒక మెగా ప్రాజెక్ట్ను లైన్లో పెట్టిన విషయం తెలిసిందే. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్పై వర్కింగ్ టైటిల్ AA23తో ఈ సినిమా రూపుదిద్దుకోనుంది.



అయితే ఈ కాంబినేషన్ అనౌన్స్మెంట్ వచ్చి చాలా రోజులు కావడం, ఆ తర్వాత ఎలాంటి అప్డేట్ లేకపోవడంతో ఈ భారీ ప్రాజెక్ట్ క్యాన్సిల్ అయిపోయిందంటూ సోషల్ మీడియాలో రకరకాల రూమర్లు షికారు చేశాయి. ఈ ప్రచారానికి చెక్ పెడుతూ తాజాగా, డైరెక్టర్ లోకేష్ కనగరాజ్, మైత్రీ మూవీ మేకర్స్ సోషల్ మీడియా వేదికగా క్లారిటీ ఇచ్చారు. అల్లు అర్జున్తో కలిసి దిగిన ఒక లేటెస్ట్ పిక్ను షేర్ చేస్తూ.. ఈ సినిమా ఆగలేదని, మరింత పవర్ఫుల్గా రూపుదిద్దుకుంటోందని స్పష్టం చేశారు. ‘ఏదో భారీ విషయం రూపుదిద్దుకుంటోంది. AA23 నుంచి త్వరలోనే ఆసక్తికరమైన అప్డేట్స్ రాబోతున్నాయి.. వేచి చూడండి’ అంటూ క్యాప్షన్ను జత చేశారు. ఈ ఒక్క పిక్తో ప్రాజెక్ట్పై వస్తున్న రూమర్లన్నింటికీ ఒకేసారి తెరపడింది. కాగా.. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ మోస్ట్ అవైటెడ్ యాక్షన్ ఎంటర్టైనర్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి పట్టాలెక్కనున్నట్లు సమాచారం. లోకేష్ కనగరాజ్ క్లారిటీ ఇవ్వడంతో అల్లు అర్జున్ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.

## రొమాంటిక్ డ్రామాతో రాబోతున్న సుహాస్ ‘హైడ్ సిల్క్’

టాలీవుడ్ టాలెంటెడ్ యంగ్ హీరో సుహాస్ వరుస పెట్టి వైవిధ్యమైన కథలతో దూసుకుపోతున్నారు. ఇటీవల తమిళ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ‘మండాడి’తో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకున్న సుహాస్.. తాజాగా, రొమాంటిక్ డ్రామాతో రాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించి అందరిలోనూ ఆసక్తిని రేకెత్తించారు. ఈ సినిమాకు ‘హైడ్ సిల్క్’ అనే విభిన్నమైన టైటిల్ను ఖరారు చేస్తూ, మేకర్స్ ఒక చిన్న గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో సుహాస్ మగ్గంపై చీర నేస్తూ కనిపించడం అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది. వీడియో వెనకాల సీనియర్ నటుడు తనికెళ్ల భరణి వాయిస్ ఓవర్ ఇస్తూ.. ‘ప్రతి చీర ఒక ప్రత్యేకమైన మహిళ కోసమే పుడుతుంది’ అనే డైలాగ్ చెబుతారు. ఇక ధారాల మధ్యే సుహాస్-సంజన ప్రేమ చిగురించిందని తెలుపుతూ.. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో అందరినీ ఆకర్షిస్తోంది. ఇక ఈ సినిమాలో సుహాస్ సరసన లబ్బర్ పండు, డీసీ చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి సంజన కృష్ణమూర్తి హీరోయిన్గా నటిస్తుండగా.. తనికెళ్ల భరణి, నందు కీలక పాత్రలో కనిపించనున్నారు. కోలీవుడ్లో ఎన్నో మంచి సినిమాలు తీసిన ప్రముఖ నిర్మాణ సంస్థ ‘స్టోన్ బెంచ్ స్టూడియోస్’, తెలుగులో నాలుగు సినిమాలు చేయడానికి ప్లాన్ చేస్తోంది. అందులో మొదటి ప్రాజెక్ట్గా రాబోతున్న ‘హైడ్ సిల్క్’ను వర్తికా జైన్కు చెందిన ‘మిశ్రిలాల్ పిక్చర్స్’తో కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో రాజేంద్ర బాల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇక ఈ సినిమా తెలుగు, తమిళంలో త్వరలోనే విడుదల కాబోతున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.